



## రేపటి నుంచి ఇసుక పోర్టల్ ప్రారంభం

**పార్వతీపురం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి):** ఇసుక పోర్టల్ గురువారం నుంచి ప్రారంభమవుతుందని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇసుక కావాల్సిన వారు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలన్నారు. కేవలం ఇసుక తవ్వకాలు, నిర్వహణ, రవాణా చార్జీలు మాత్రమే భరించాలన్నారు. ప్రతిరోజూ బుక్ చేసుకున్న వాహనాల వివరాలను పోలీస్‌శాఖకు అందించాలన్నారు. వాటికే అనుమతి ఉంటుందన్నారు. సొంత ఇంటి నిర్మాణం కోసం ఎడ్ల బండితో ఇసుక తీసుకెళ్లవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో జేసీ శోభిక పాల్గొన్నారు.

# ఆ రోడ్లపై ప్రయాణం నరకం

- నిధులున్నా.. బిల్లులు చెల్లించని వైసీపీ ప్రభుత్వం
- మక్కువ నుంచి సాలూరు, బొబ్బిలి, పార్వతీపురానికి వెళ్లలేని పరిస్థితి
- వాహనదారులు, ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు
- మరింత అధ్వానంగా మారిన రోడ్లు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు



మక్కువ నుంచి చినబోగిలి రహదారి దుస్థితి ఇది

**మక్కువ:** మక్కువ నుంచి సాలూరు, బొబ్బిలి, పార్వతీపురం పట్టణాలకు వెళ్లే ప్రధాన రోడ్లు పూర్తిగా అధ్వానంగా మారాయి. దారి పొడవునా ఏర్పడిన భారీ గోతులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. వాహనదారులు, ప్రయాణికులను భయాందోళనకు గురి చేస్తున్నాయి. వర్షం పడితే చాలు.. వారి బాధలు రెట్టింపవుతున్నాయి. గోతుల్లో నీరు చేరడంతో రోడ్డు ఎక్కడుందో వెతుక్కోవాల్సిన పరిస్థితి. దీంతో తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వాహనాలు కూడా గోతుల్లో దిగబడి మరమ్మతులకు గురవుతున్నాయి. ఈ రోడ్ల నిర్మాణానికి గత వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీ గాలిలో కలిసిపోయింది. దీంతో ఈ మార్గంలో రాపోకలు సాగించే ప్రజలు నరకం చూస్తున్నారు.



అధ్వానంగా మారిన సాలూరు రహదారి

### బిల్లులు చెల్లించక..

● మక్కువ నుంచి చినబోగిలి, సాలూరు రోడ్లుకు నిధులు మంజూరైనా.. గత వైసీపీ ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించలేదు. దీంతో మధ్యలోనే పనులు నిలిచిపోయాయి. మక్కువ-సాలూరు రోడ్డు విస్తరణకు మూడేళ్ల కిందట రూ.56 కోట్లు మంజూరయ్యాయి. రహదారికి ఇరువైపులా మొక్కలు తొలగించి కల్వర్టులు నిర్మించారు. అయితే ఆ తర్వాత బిల్లుల చెల్లింపులు జరగకపోవడంతో ఈ పనులు కూడా మధ్యలోనే ఆగిపోయాయి. ప్రస్తుతం ఈ రోడ్డు మరింత దారుణంగా తయారవడంతో గతంలో సాలూరు-మక్కువకు నాలుగు సర్వీసులు ఉండగా.. నేడు ఒక్కటి కూడా లేదు. పాయకపాడు, చెప్పుబుచ్చింపేట, తాడిలోవ, నక్కడవలస మీదుగా ప్రైవేట్ వాహనాలపై ప్రజలు సాలూరు వెళ్లాల్సి వస్తోంది. మరికొందరు శంబర, మామిడిపల్లి మీదుగా సాలూరు పట్టణానికి చేరుకోవాల్సి వస్తోంది. బస్సులు సైతం అదే మార్గంలో వెళ్లడంతో ప్రయాణికులు అదనంగా పది కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది.

● మక్కువ నుంచి పార్వతీపురం పట్టణానికి వెళ్లేందుకు గాను చినబోగిలి రహదారికి అప్పట్లో రూ. 34 కోట్లు కేటాయించారు. అయితే రూ.నాలుగు కోట్లతో కల్వర్టులు, రాళ్లు వేసి వదిలేశారు. పనులు జరిగినా కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో విస్తరణ పనులు మధ్యలో ఆగిపోయాయి. మరోవైపు పార్వతీపురం-మక్కువకు ఉన్న మూడు ఆర్టీసీ బస్సులను సర్వీసులను గాను ప్రస్తుతం ఒకటే నడుపుతున్నారు. దీంతో విద్యార్థులు, ఉద్యోగులకు అవస్థలు తప్పడం లేదు.

● మక్కువ నుంచి బొబ్బిలికి దశాబ్దాల కిందట నిర్మించిన రహదారి కూడా పూర్తిగా శిథిలమైంది. దీనికి తోడు ఇటీవల వర్షాలకు బొబ్బిలి మండలం పారాది వంతెన కొట్టుకుపోవడంతో సాలూరు నుంచి మక్కువ మీదుగా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రోడ్లు మరింతగా పాడవుతున్నాయి. దీనిపై నూతన ప్రభుత్వం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతవాసులు కోరుతున్నారు.

### నిత్యం అవస్థలే...

సాలూరు, బొబ్బిలి, పార్వతీపురం పట్టణాలకు వెళ్లాలంటే నిత్యం అవస్థలు తప్పడం లేదు. అధ్వాన రహదారులతో ఇబ్బందికరంగా ఉంది. రాకపోకలు సాగించలేకపోతున్నాం. బయటకు వెళ్లి ఇంటికి వచ్చేసరికి అనారోగ్యం పాలవుతున్నాం. రహదారుల నిర్మాణంపై నూతన ప్రభుత్వందృష్టిసారించాలి.

-కె.చంద్రశేఖర్, మక్కువ

### బిల్లులు అందకే..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం వల్లే రహదారుల పనులు జరగలేదు. పెండింగ్ బిల్లుల విషయాన్ని నూతన ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాం. ఆదేశాలు వచ్చిన వెంటనే రోడ్లు నిర్మాణాలు చేపడతాం.

-ఎం.జేమ్స్, ఈఈ, పార్వతీపురం డివిజన్



కోతకు గురైన బొబ్బిలి రహదారి

# అవినీతి ప్లానింగ్





- ఇల్లు కట్టుకోవాలంటే ముడుపులు చెల్లించాల్సిందే
- భవనం బట్టి రేటు నిర్ణయం
- వైసీపీ పాలనలో ఓ అధికారి హవా
- కూటమి ప్రభుత్వంలో కూడా మారని తీరు

**పార్వతీపురం మున్సిపాలిటీలో ఓ అధికారి పక్కా ప్లానింగ్ ప్రకారం అవినీతికి పాల్పడుతున్నాడు. భవనం బట్టి రేటు నిర్ణయిస్తాడు. దళారుల ద్వారా ఈ విషయాన్ని నిర్మాణదారులకు చెబుతాడు. వారి ద్వారా ముడుపులు అందుకుని ప్లానింగ్‌కు ఆమోదం తెలుపుతాడు. తన పైఅధికారులకు కూడా వాటాలు అందుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో ఆయన అవినీతి మూడు పువ్వులు ఆరు కాయలు అన్నట్లు సాగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఆయన హవా మాత్రం తగ్గలేదు. దీంతో సామాన్యులు ఇళ్లు కట్టుకోలేని పరిస్థితి నెలకొంది.**

(పార్వతీపురం ఆంధ్రజ్యోతి)

పార్వతీపురం జిల్లా కేంద్రంగా మారిన తర్వాత బహుళ అంతస్తుల భవనాలు, ఇళ్ల నిర్మాణాలు జోరుగా జరుగుతున్నాయి. అయితే వీటికి సంబంధించిన ప్లానింగ్ అమలు కోసం అధికారికి ముడుపులు చెల్లించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నాయకులు సంబంధిత ప్లానింగ్ అధికారికి తెరవెనుక ఆదేశాలను జారీ చేసేవారు. సదరు అధికారి వైసీపీ నేతలకు అనుకూలంగా పని చేసేవాడని విమర్శలు ఉన్నాయి. వారు చెప్పిన నిర్మాణదారులకే ప్లానింగ్ అనుమతులు ఇచ్చేవాడు. ఇలా గత ఐదేళ్లు దర్జాగా అవినీతికి పాల్పడ్డాడు. అయితే ప్రభుత్వం మారినా ఆయన తీరు మాత్రం తగ్గలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో కూడా అదే హవా కొనసాగిస్తున్నాడనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ అధికారి కింద కొందరు దళారులు పని చేస్తున్నారు. వీరు భవన నిర్మాణదారుల వద్దకు వెళ్లి అనుమతులు మంజూరు చేయాలంటే ముడుపులు చెల్లించుకోవాల్సిందేనని చెబుతుంటారు. ప్లానింగ్ ఆమోదం నుంచి పురపాలక సంఘంలో ఏ పనీ పెండింగ్ లేకుండా చేపట్టేందుకు భవన నిర్మాణాన్ని బట్టి రేటు నిర్ణయించి వసూలు చేసి సదరు అధికారికి అందిస్తుంటారు. ఇందుకు ఆ అధికారి దళారులకు కొంత ముట్టజెబుతాడు. అలాగే తన పైఅధికారులకు కూడా వాటాలు అందుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. అధికారి అవినీతిపై పట్టణ ప్రజలు కోడై కూస్తున్నా ఆ శాఖ ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. గతంలో ఓ భవన నిర్మాణ కార్మికుడి నుంచి కూడా ముడుపులు తీసుకుని ఇల్లు కట్టుకునేందుకు అనుమతులు ఇచ్చారు. దీనిపై ఏసీబీ అధికారులకు ఫిర్యాదు అందడంతో వారు దాడిచేసి ప్లానింగ్ అధికారిని పట్టుకున్నారు. దీనిబట్టి అవినీతి ఏ స్థాయిలో జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. ధనిక, పేద అనే తేడా లేకుండా వారి నుంచి డబ్బులు తీసుకుని ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టిసారించి విచారణ నిర్వహిస్తే అవినీతి అధికారి బండారం బయటపడే అవకాశం ఉంది.

# చెత్త రహిత జిల్లాయే లక్ష్యం

- పరిశుభ్రతతోనే ఆరోగ్యం
- స్వచ్ఛతాహీ కార్యక్రమంలో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

**భామిని, సెప్టెంబరు 17:** చెత్త రహిత జిల్లాయే లక్ష్యంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం భామినిలో నిర్వహించిన స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణతో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉన్న చెత్తను వ్యక్తిగత కృషితో శుభ్రపర్చుకోవాలన్నారు. పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుం దన్నారు. అందరికీ ఆదర్శంగా నిలిచేలా స్వచ్ఛత పాటించి భామిని మండలాన్ని నెంబర్ వన్‌గా నిలపాలని కోరారు. ముందుగా ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు మానవహారం నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఐఎస్‌సీసీ ప్రతినిధి రవిశంకర్, డైరక్టర్ కవిత, సబ్ కలెక్టర్ యశ్వంత్ కుమార్‌రెడ్డి, రెడ్ క్రాస్ చైర్మన్ శ్రీరాములు, మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

### దివ్యాంగులకు పరికరాల పంపిణీ..

ఆశావహ బ్లాకులో భాగంగా భామిని మండలంలో దివ్యాం గులకు రూ.28 లక్షల విలువైన పరికరాలను కలెక్టర్, ఎమ్మె ల్యే చేతుల మీదుగా అందించారు. 500 మంది దివ్యాంగుల కు పరీక్షించగా 147 మందిని ఎంపిక చేసి ట్రైసైకిళ్లు, వినికిడి పరికరాలు, బ్యా టరీ సైకిళ్లు, సెల్‌ఫోన్లు, కృత్రిమ కాళ్లు తదితర పరికరాలను పంపిణీ చేశారు.

### కలెక్టర్ దృష్టికి సమస్యలు..

ఎమ్మెల్యే జయకృష్ణ పలు సమస్య లను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. భామి ని మండలాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. రైతులకు సాగునీటి ఇబ్బందు లు ఉన్నాయని తెలిపారు. బత్తిలిలో లిఫ్ట్ ఇరిగేషన్, భామినిలో కొండలోవ గెడ్డ అర్థాంతరంగా నిలిచిపోయాయన్నారు. బత్తిలి వెర్రి గెడ్డ చెక్‌డ్యామ్ ఎంతో అవసరమని చెప్పారు. ఇంటర్ పాసయ్యాక విద్యార్థులు చదువు మానేసిన పరిసితి నెల కొంటుందని, డిగ్రీ కళాశాల నిర్మించాలని కోరారు. సింగిడి రిజర్వాయర్ కోసం భూసేకరణ చేసి మూడేళ్లు అయినా పట్టించుకోలేదన్నారు. కలెక్టర్ స్పందిస్తూ.. విడతల వారీగా సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.

● కొండ ప్రాంతాల్లో ఉన్న గర్భిణుల ఆరోగ్యంపై నిరంతరం దృష్టిసారించాలని కలెక్టర్ అంగన్వాడీ, వైద్య సిబ్బందికి సూచించారు. వెలుగు కార్యాలయంలో నిర్వహించిన పోషణ అభియాన్ మెడికల్ స్ర్కీన్ టెస్ట్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సంపూర్ణ పోషక ఆహారం అందించాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించి ఆశీర్వదించారు.



స్వచ్ఛతాహీ సేవాలో భాగంగా మానవహారం నిర్వహిస్తున్న దృశ్యం



దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎమ్మెల్యే జయకృష్ణ

### 14 రోజుల పాటు కార్యక్రమాలు..

**పార్వతీపురం ఆంధ్రజ్యోతి:** పార్వతీపురంలో జరిగిన స్వచ్ఛ తాహీ సేవా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. అక్టోబరు 2 వరకు జిల్లాలో పలు కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, కంటోన్మెంట్ బోర్డులు, బీచ్‌లు, పర్యాటక ప్రదేశాలు, జంతు ప్రదర్శనశాలలు, జాతీయ పార్కులు, అభయారణ్యాలు, చారిత్రక స్మారక చిహ్నాలు, వారసత్వ ప్రదేశాలు, రివర్ ఫ్రంట్‌లు, ఘాట్‌లు, డ్రెయిన్‌లు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో స్వచ్ఛత కార్యక్రమాల నిర్వహణపై దృష్టిసారించాలన్నారు. 14 రోజులు పాటు చేపట్టే కార్యక్రమాలు విజయవంతం చేయాలని కోరారు. ప్రజలు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువత, స్వచ్ఛంద సంస్థలు, సీనియర్ సిటిజన్స్ వ్యాపారవేత్తలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

# విద్యార్థుల్లో నులి పురుగుల నివారణకు కృషి

- డీఎంహెచ్‌వో విజయపార్వతి



విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న డీఎంహెచ్‌వో


**బెలగాం, సెప్టెంబరు 17:** విద్యార్థుల్లో నులిపురుగుల నివారణకు కృషి చేస్తామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.విజయపార్వతి అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన డీ వార్మింగ్ డే కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో పరిశీలించారు. ఎంతమంది విద్యార్థులు, పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. కడుపులో నులిపురుగుల ఉంటే రక్త హీనత, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, పోషకాహార లోపం వంటి సమస్యలు వస్తాయన్నారు. అందుకే 1 నుంచి 19 ఏళ్ల పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు వేయించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్బీఎస్‌కే జిల్లా సమన్వయ అధికారి డా.రఘుకుమార్, డీఐవో డా.నారాయణరావు, ప్రిన్సిపాల్ జె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

## పార్వతీపురం సబ్ కలెక్టర్‌గా అశుతోష్



**పార్వతీపురం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి):** పార్వతీపురం సబ్ కలెక్టర్‌గా అశుతోష్ శ్రీవాత్సవ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన కొవ్వూరు సబ్ కలెక్టర్‌గా పనిచేస్తూ బదిలీపై పార్వతీపురం వచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజలకు మంచి సేవలు అందించి మన్ననలు పొందాలని ఆయనకు కలెక్టర్ సూచించారు.

## జిల్లా రవాణా అధికారిగా దుర్గా ప్రసాద్



**పార్వతీపురం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి):** జిల్లా రవాణా అధికారిగా టి.దుర్గాప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. రవాణా వ్యవస్థను చక్కగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఇసుక రవాణాకు వాహనాలను నమోదు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ధాన్యం సేకరణ సమయంలో వాహనాల అవసరాన్ని ముందుగానే గుర్తించి తగు చర్యలు చేపట్టాలని సూచించారు.

# విష జ్వరాల పంజా

- మంగళవారం ఒక్కరోజే 84 కేసులు
- వేధిస్తున్న కీళ్ల నొప్పులు
- రోగులతో కిటకిటలాడుతున్న ఏరియా ఆస్పత్రి



ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

**సీతంపేట రూరల్, సెప్టెంబరు 17:** సీతంపేట మన్యంలో విష జ్వరాలు పంజా విసురుతున్నాయి. అల్పపీడన ప్రభావంతో ఇటీవల ఏజెన్సీలో కురిసిన భారీ వర్షాలు, వాతావరణంలో ఏర్పడిన మార్పుల కారణంగా విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఎపడమిక్ సీజన్ చివరి దశలో ఉన్నప్పటికీ జ్వరపీడితులు సంఖ్య తగ్గుముఖం పట్టడం లేదు. జ్వర పీడితులతో సీతంపేట ఏరియా ఆసుపత్రి కిటకిటలాడుతుంది. మంగళవారం ఏరియా ఆసుపత్రిలో 316 ఓపీ నమోదుకాగా, వీటిలో 84 మంది వైరల్ జ్వరాలతో బాధపడుతున్నట్లు రక్త పరీక్షల్లో నిర్ధారణ అయ్యింది. ఒక కేసు మలేరియా పాజిటివ్‌గా వచ్చింది. జ్వర పీడితులను ఎక్కువగా కీళ్ల నొప్పుల సమస్య వెంటాడుతోంది. దీంతో వారు ఏ పని చేయలేక నీరసించి పోతున్నారు. దోనుబాయి, మర్రిపాడు వంటి ప్రాంతాలకు చెందిన జ్వరపీడితులు ఎక్కువగా ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అలాగే, ఐటీడీఏ పరిధిలోని హడ్డుబంగి, సీతంపేట గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులు విష జ్వరాలతో సీతంపేట ఏరియా ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. హడ్డుబంగి ఆశ్రమ పాఠశాలకు చెందిన సవర ఆరాధ్య, సవర హాసిని, షర్మిళ, కావేరి, శ్రీలతలు వైరల్ జ్వరాలతో బాధపడుతూ పాఠశాల ఏఎన్‌ఎం పర్యవేక్షణలో ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

### గతంతో పోల్చుకుంటే తక్కువే..



వైరల్ జ్వరపీడితుల సంఖ్య గత ఐదు రోజుల కిందటితో పోల్చుకుంటే తక్కువే. ఇటీవల కురిసిన వర్షాలు, వాతావర ణంలో మార్పుల కారణంగా వైరల్ జ్వరాలు ఎక్కువగా ఉన్నాయి. విష జ్వరాల బారినపడిన వారిలో కీళ్లు, ఒంటి నొప్పులు ఎక్కువగా ఉంటాయి. భయపడాల్సిన అవసరం లేదు. మూడు రోజులు చికిత్స తీసుకుంటే సరిపోతుంది. ముఖ్యంగా ఆరుబయట తిరగకుండా ఇంట్లోనే ఉండి వేడి ఆహారంతో పాటు విశ్రాంతి తీసుకోవాలి.

-శ్రీనివాసరావు, సూపరింటెండెంట్, సీతంపేట ఏరియా ఆసుపత్రి

దిక్సూచి
DIKSUCHI

మహిళలను సాంకేతిక విద్యలో ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన 'ప్రగతి స్కాలర్‌షిప్ స్కీమ్' నోటిఫికేషన్ వెలువడింది. 'ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ)' ఏటా దీనిని ఆఫర్ చేస్తోంది. ఈ స్కీమ్ ద్వారా డిప్లొమా, డిగ్రీ కేటగిరీల్లో అర్హులైన అమ్మాయిలకు ఆర్థిక సహకారం అందిస్తారు. ఒక కుటుంబం నుంచి ఇద్దరు అమ్మాయిలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. అకడమిక్ మెరిట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

# ఏఐసీటీఈ ప్రగతి స్కాలర్‌షిప్ స్కీమ్

**తెలుగు రాష్ట్రాల్లో స్కాలర్‌షిప్‌లు:** డిప్లొమా, డిగ్రీ కేటగిరీల్లో ఒక్కోదానికి 5,000 చొప్పున దేశవ్యాప్తంగా మొత్తం 10,000 స్కాలర్‌షిప్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటికి అదనంగా నిర్దేశిత కేంద్ర పాలిత ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి దరఖాస్తు చేసుకొన్న విద్యార్థినులందరికీ స్కాలర్‌షిప్ సౌకర్యం కల్పిస్తారు.
- డిప్లొమా కేటగిరీలో ఆంధ్రప్రదేశ్‌కు 318, తెలంగాణకు 206 స్కాలర్‌షిప్‌లు కేటాయించారు.
- డిగ్రీ కేటగిరీలో ఆంధ్రప్రదేశ్‌కు 566, తెలంగాణకు 424 స్కాలర్‌షిప్‌లు ప్రత్యేకించారు.

**అర్హతలు:** డిప్లొమా కేటగిరీకి అప్లయ్ చేసుకోవాలంటే గుర్తింపు పొందిన పాఠశాల నుంచి పదోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఈ విద్యా సంవత్సరానికి టెక్నికల్ డిప్లొమా లెవెల్ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి. లేటరల్ ఎంట్రీ ద్వారా డిప్లొమా ద్వితీయ సంవత్సరంలో చేరినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- డిగ్రీ కేటగిరీకి దరఖాస్తు చేసుకోవాలంటే గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఏదేని టెక్నికల్ డిగ్రీ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి. లేటరల్ ఎంట్రీ ద్వారా రెండో సంవత్సరంలో ప్రవేశం పొందిన వారు కూడా అర్హులే.
- పదోతరగతి/ఇంటర్ పూర్తిచేసిన రెండేళ్లలోపు ఏఐసీటీఈ గుర్తింపు పొందిన సంస్థలో డిప్లొమా/డిగ్రీ ప్రవేశం పొంది ఉండాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఇతర మెరిట్ స్కాలర్‌షిప్స్ పొందుతున్నవారు, పీఎంఎస్‌ఎస్‌ఎస్ స్కీం కింద చదువుకుంటున్నవారు, నాన్ టెక్నికల్ కోర్సుల్లో చేరినవారు, డ్యూయెల్ డిగ్రీ/పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందినవారు, ఇతరత్రా స్టయిపెండ్/ఆదాయం పొందుతున్నవారు దరఖాస్తుకు అనర్హులు.

**స్కాలర్‌షిప్:** టెక్నికల్ డిప్లొమా రెగ్యులర్ కోర్సు లో చేరినవారికి మూడేళ్లు, లేటరల్ ఎంట్రీ అభ్యర్థులకు రెండేళ్లు; టెక్నికల్ డిగ్రీ రెగ్యులర్ కోర్సులో చేరినవారికి నాలుగేళ్లు, లేటరల్ ఎంట్రీ అభ్యర్థులకు మూడేళ్ల పాటు స్కాలర్‌షిప్ అందిస్తారు. కాలేజ్ ఫీజు, కంప్యూటర్ కొనుగోలు, సాఫ్ట్‌వేర్, స్టేషనరీ, బుక్స్, ఎక్విప్‌మెంట్ తదితరాల నిమిత్తం ఏడాదికి రూ.50,000లు ఇస్తారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) విధానంలో నేరుగా అమ్మాయి బ్యాంక్ ఖాతాకు ఈ మొత్తాన్ని జమ చేస్తారు.
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 31
- **వెబ్‌సైట్:** scholarships.gov.in

SCHOLARSHIP ALERT

## Corteva Agriscience Scholarship Program 2024-25



**Description:**
An initiative of Corteva Agriscience Seeds Pvt. Ltd., this program aims to provide financial assistance to meritorious students pursuing postgraduate, doctoral or undergraduate courses in the area of agriculture, as well as students in Classes 11 and 12 with STEM subjects.
**Eligibility:**
Female students in post-graduate (MBA/ M.Sc./M.Tech.), doctoral, or undergraduate courses, as well as for those in Classes 11 and 12 with STEM subjects (government/private schools).
The applicant's annual family income must be ?6,00,000 or less.
Students from across India can apply Children of employees of Corteva & Buddy4Study are not eligible.
**Prizes & Rewards:** For PG students: INR 50,000
**For UG students:** INR 25,000
**For school students:** INR 10,000
**Last Date to Apply:** 30-09-2024
**Application mode:** Online applications only
**Short Url:** www.b4s.in/aj/CASP4

## Alstom India Scholarship 2024-25

**Description:** Alstom India is offering this scholarship to provide financial support to students across India to help them pursue their higher education and prevent them from dropping out of college.
**Eligibility:** Students studying in any year of professional graduation in STEM courses can apply. Applicants must have secured at least 60% marks in their previous academic year/semester.
The annual family income of the applicants must be less than or equal to INR 6,00,000 from all sources. The scholarship is open to students residing in locations such as Chennai (Tamil Nadu), Coimbatore (Tamil Nadu), Kolkata (West Bengal), Madhepura (Bihar), Sri City (Andhra Pradesh), or Vadodara (Gujarat).
**Prizes & Rewards:**
Up to INR 75,000 (one-time)
**Last Date to Apply:** 30-09-2024
**Application mode:** Online applications only
**Short Url:** www.b4s.in/aj/AISDG7

## Infosys Foundation STEM Stars Scholarship Program 2024-25

**Description:** An initiative by the Infosys Foundation to support female students in India who aspire to pursue undergraduate degrees in STEM courses (Science, Technology, Engineering, Mathematics), Medical Sciences (MBBS), Bachelor of Dental Surgery (BDS), Bachelor of Pharmacy (B.Pharm)!
**Eligibility:** Applicants must be female students who are citizens of India.
Students must be enrolled in the First year of a 3 year B.Sc Degree (Courses such as Bio-chemistry, Physics, Chemistry, Nursing, Geography, IT, Biology, Computer Science, Forensic Science, etc.)
First or 2nd year of B.Tech, MBBS, B.Pharm, BDS, Integrated Masters, Dual Degree (B.Tech + M.Tech)
Students must be enrolled in institutes listed among the top ranks in the NIRF (National Institutional Ranking Framework) for 2023 or 2024.
Candidates must have obtained admission into the identified colleges and completed their Class 12.
Applicants must have an annual family income of less than or equal to ?8 lakh.
Candidates must not have availed other scholarships for the same expenses.
**Prizes & Rewards:** The selected candidates will receive a scholarship of up to ?1 lakh per annum, covering tuition, living expenses, and study materials, for the duration of the course against paid receipts.
**Last Date to Apply:** 30-09-2024
**Application mode:** Online applications only
**Short Url:**
www.b4s.in/aj/ISTS2

buddy4study.com

నవ్య | చిత్రజ్యోతి

# వెట్రిమారన్ దర్శకత్వంలో నటించాలని ఉంది

ఎన్టీఆర్



తమిళంలో తన అభిమాన దర్శకుడు, జాతీయ అవార్డు గ్రహీత వెట్రిమారన్ దర్శకత్వం వహించే తమిళ స్ట్రెయిట్ చిత్రంలో నటించి, దానిని తెలుగులోకి అనువదించాలని ఉందని జూనియర్ ఎన్టీఆర్ చెప్పారు. కొరటాల శివ దర్శకత్వంలో జూనియర్ ఎన్టీఆర్ హీరోగా నటించిన 'దేవర' చిత్ర ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం చెన్నైలో విలేకరుల సమావేశం జరిగింది. తమిళంలో స్ట్రెయిట్ చిత్రం ఎప్పుడు చేస్తారని విలేకరులు ప్రశ్నించగా, అలా సమాధానం చెప్పారు ఎన్టీఆర్. ఈ సమావేశంలో చిత్ర దర్శకుడితో పాటు హీరోయిన్ జాన్వీకపూర్, సంగీత దర్శకుడు అనిరుధ్, కెమెరామెన్ రత్నవేలు, గేయరచయిత రామజోగయ్య శాస్త్రి, తమిళనాడు 'దేవర' చిత్ర పంపిణీదారుడు, నిర్మాత ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూనియర్ ఎన్టీఆర్ మాట్లాడుతూ... చెన్నైతో తనకు చిన్ననాటి నుంచి అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమ పునాదులు చెన్నైలో ఉన్నాయని, ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలివెళ్లిందన్నారు. దేవర చిత్రం ఇంత బాగా రావడానికి ప్రధాన కారణం నటీనటులేనని, ముఖ్యంగా, దర్శకుని విజన్‌లో తెరపై ప్రతిబింబించేలా చేసిన సినిమాటోగ్రాఫర్, ఎడిటర్, సంగీత దర్శకులకు ఆ క్రెడిట్ దక్కుతుందన్నారు. ప్రేక్షకులంతా ఒక్కటేనని బాహుబలి చిత్రం నిరూపించిందని, ఇప్పటివరకు భాషాపరంగా వేరుగా ఉన్నా, సినిమాపరంగా తమిళం, తెలుగు, కన్నడం, మలయాళం, హిందీ అంతా ఒక్కటేనని నిరూపితమైందన్నారు.

- చెన్నై, ఆంధ్రజ్యోతి

# వర్క్ పేరుతో మైనర్ యువతిపై వేధింపులు

- ఎంక్వయిరీలో దొరికిన ఆధారాలు..
- 90 రోజుల్లోపే నివేదిక
- ప్రెస్‌మీట్‌లో నటి ఝాన్సీ వెల్లడి

నృత్య దర్శకుడు జానీ తనపై చేసిన లైంగిక వేధింపుల గురించి బాధితురాలు చేసిన ఫిర్యాదుపై నార్సింగ్ పోలీసులు ఎఫ్.ఐ.ఆర్. నమోదు చేసి విచారణ చేపట్టారు. అలాగే టాలీవుడ్ లైంగిక వేధింపుల పరిష్కార ప్యానెల్ మంగళవారం ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసింది. ఈ ప్యానెల్ ఛైర్‌పర్సన్, నటి ఝాన్సీ , తమ్మారెడ్డి భరద్వాజ దామోదర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఝాన్సీ మాట్లాడుతూ ' ఇద్దరు ప్రముఖ కొరియోగ్రాఫర్స్ మధ్య ఉన్న మేటర్ ఇది. చిత్ర పరిశ్రమ అనేది అన్ ఆర్గనైజ్‌డ్ సెక్టార్. మహిళల రక్షణ కోసం ఇక్కడ సరైన గైడ్‌లైన్స్ లేవు. డిఫరెంట్ వింగ్స్‌లో పరిశ్రమ పని చేస్తుంది కాబట్టి ఏ రకమైన గైడ్ లైన్స్ ఉండాలనేది ప్రభుత్వంతోచర్చించాలి. అయితే తెలుగు చిత్ర పరిశ్రమలో లైంగిక వేధింపులు లేవు అని మేం చెప్పడం లేదు.ఇతర భాషల పరిశ్రమలో ఉన్న సమస్యలు, సెక్సువల్ హరాస్‌మెంట్ ఇక్కడ కూడా ఉంది, ఇద్దరు కొరియోగ్రాఫర్ల మధ్య జరిగిన వ్యవహారం ఇది. వాళ్ల పేర్లు బయట పెట్టదలచుకోలేదు ఒక హయ్యర్ పొజిషన్ లో ఉన్న వ్యక్తి మీద ఆరోపణ వచ్చింది. బాధితురాలు మైనర్‌గా ఉన్న దగ్గర నుంచి పని చేస్తోంది. ఆమె మొదట మీడియా ఛానల్స్‌ను ఎప్రోచ్ అయింది. ఇది మీడియాలో వస్తే చాలా పెద్ద ఇష్యూ అవుతుంది కనుక నువ్వు ఛాంబర్‌కు వెళ్లమని మీడియా వారు భరద్వాజ దగ్గరకి, సుప్రియ దగ్గరకు వెళ్లమని సలహా ఇచ్చారు. పరిశ్రమలో నాకు వర్క్ కావాలి అని ఆమె ఛాంబర్ ముందు వచ్చింది. పని ఇస్తామని చెప్పి వేధిస్తున్నారని వచ్చింది. ఫెడరేషన్ ద్వారా ఛాంబర్ ఆమెకి కార్డు ఇప్పించింది. అయితే కార్డు ఇవ్వడం వెనుక సెక్సువల్ హరాస్‌మెంట్ ఉందనే విషయం ఆమెతో మాట్లాడిన తర్వాత మాకు అర్థమైంది. అయితే సెక్సువల్ హరాస్‌మెంట్ అనేది వర్క్ ప్లేస్‌లో కాదని తెలిసింది. ఆమె కంప్లయింట్ రికార్డ్ చేశాం. ఆ కొరియోగ్రాఫర్ స్టేట్‌మెంట్ కూడా రికార్డ్ చేశాం. వర్క్ పేరుతో ఒక మైనర్ మీద వేధింపులు జరిగాయి. దీని మీద ఎంక్వయిరీ జరుగుతోంది. ఆధారాలు కొన్ని దొరికాయి. గైడ్‌లైన్స్ ప్రకారం మాకు 90 రోజుల గడువు ఉంది. దానిలోపే పని పూర్తి చేసి రిపోర్ట్ ఇస్తాం. వర్క్ ప్లేస్‌లో మహిళలకు భద్రత కల్పించాలనీ, ఇది సురక్షిత ప్రదేశమని నిరూపించాలని మా తపన.' అని చెప్పారు. తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ 'ఇలాంటి కేసుల కోసమే 2013లో 'ఆసరా' ఏర్పాటు చేశాం. 2018లో ఈ ప్యానెల్ పెట్టాం. పరిశ్రమలో మహిళలు సేఫ్‌గా ఉంటారని చెప్పడానికే ఈ ప్రెస్‌మీట్ పెట్టాం' అన్నారు.



## ఫిర్యాదు చెయ్యండిలా : టీఎఫ్‌సీసీ

లైంగిక వేధింపులు ఎదుర్కొన్న వారు ఫిర్యాదు చేయాలని టీఎఫ్‌సీసీ ఒక ప్రకటనలో పేర్కొంది. హైదరాబాద్ తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆఫీసు వద్ద ఉదయం 6గంటల నుండి రాత్రి 8 గంటల వరకు కంప్లైంట్ బాక్స్ అందుబాటులో ఉంటుందని పేర్కొంది. తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ డి.రామానాయుడు బిల్డింగ్ కాంప్లెక్స్, ఫిల్మ్‌నగర్, జూబ్లీహిల్స్, హైదరాబాద్ - 500096 చిరునామాకు పోస్టుద్వారా అయినా ఫిర్యాదు చేయవచ్చని తెలిపింది. ఫోన్ నంబరు : 98499 72280, మెయిల్ ఐడీ : complaints@telugufilmchamber.in కు కంప్లైంట్స్ ఇవ్వొచ్చని విజ్ఞప్తి చేసింది.

## బాధితురాలికి పరిశ్రమ భరోసా



ఈ కేసు తర్వాత ఈ ఫిమేల్ కొరియోగ్రాఫర్ తన పని ప్రశాంతంగా చేసుకోగలగాలి. దీని వల్ల తన జీవితం నాశనం అయిపోతుంది, వచ్చే అవకాశాలు పోతాయి. పరిశ్రమ నుంచి వెళ్లిపోవాల్సి వస్తుంది.. అనే భయం ఆమెకి ఉండకూడదు. ఆ అమ్మాయి టాలెంట్ పరిశ్రమకు తెలుసు. ఈ కేసు ఎటువైపు వెళ్లినా ఆమె టాలెంట్‌కు వచ్చే ఇబ్బంది ఏమీ లేదు. ఆమెకు చిత్ర పరిశ్రమ సపోర్ట్‌గా నిలబడింది. కొంతమంది నిర్మాతలు ఆమెకు అవకాశాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. ఆమె టాలెంట్ తెలిసిన పెద్ద సంస్థ, దర్శకుడు అవకాశం ఇస్తున్నారు. ఒక పెద్ద హీరో తన మేనేజర్ ద్వారా కబురు చేసి ఆమెకు మద్దతు పలికారు. టాలెంట్‌కు పరిశ్రమ నుంచి ఎప్పుడూ సపోర్ట్ ఉంటుంది

-ఝాన్సీ

# ఆ ఇల్లు అమ్మక తప్పలేదు

- కంగన



'ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు' అనేది ఒకప్పటి సామెత. దానికి పొడిగింపుగా 'సినిమా తీసి చూడు' అని చేర్చుకోవాల్సి వస్తోంది ఇప్పుడు. ఇందుకు తాజా ఉదాహరణ బాలీవుడ్ నటి. దర్శకురాలు కంగనా రనౌత్. ఆమెకు ముంబైలో బాంద్రా ప్రాంతంలోని పాలీ హిల్ లో ఓ ఖరీదైన బంగ్లా ఉంది. 2017లో రూ. 20 కోట్లకు దీన్ని కొన్నారు కంగనా. నిబంధనలకు విరుద్ధంగా ఉందని 2020లో ఈ బంగ్లాలోని కొంత భాగాన్ని బొంబాయి మున్సిపల్ కార్పొరేషన్ కూల్చివేయడంతో అప్పట్లో కంగనా అధికార పార్టీని తీవ్రంగా విమర్శించారు. ఇప్పుడు అదే బంగ్లాను అమ్మేశారు కంగనా. కారణం.. ఆమె దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'ఎమర్జెన్సీ' సినిమా. జీ స్టూడియోస్‌తో కలసి ఆమె నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 6న విడుదల కావాలి. కానీ సెన్సార్ సర్టిఫికెట్ రాని కారణంగా విడుదల వాయిదా పడింది. ఇప్పటికే ఆ సినిమా మీద చాలా డబ్బు పెట్టిన కంగనా మిగిలిన ఖర్చుల కోసం బంగ్లాను కూడా అమ్మేశారు. 'నా దృష్టిలో ఆస్తులు అనేవి అవసరం వచ్చినప్పుడు ఆదుకొనేవే. అందుకే బంగ్లా అమ్మేశాను' అని చెప్పారు కంగనా. రూ. 32 కోట్లకు అమ్మకం జరిగిందని సమాచారం.

# ఇప్పటికైనా త్రివిక్రమ్‌ను ప్రశ్నించండి

- పూనమ్‌కౌర్



కొరియోగ్రాఫర్ షైక్ జానీ భాష (జానీ మాస్టర్)పై అత్యాచార కేసు టాలీవుడ్‌లో చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నటి పూనమ్ కౌర్ సోషల్‌మీడియాలో పెట్టిన పోస్ట్ చర్చనీయాంశంగా మారింది. "నేను గతంలో దర్శకుడు త్రివిక్రమ్‌పై మూవీ ఆర్టిస్ట్స్ అసోషియేషన్ (మా)కు ఫిర్యాదు చేశాను. నా ఫిర్యాదుపై 'మా' చర్యలు తీసుకోలేదు. 'మా' గనక నా ఫిర్యాదును పరిశీలించి ఉంటే.. నాకూ... మరికొంత మందికి ఇబ్బందులు తప్పేవి. రాజకీయంగా కూడా నేను ఇబ్బందులు ఎదుర్కొన్నాను. ఇప్పటికైనా ఇండస్ట్రీ పెద్దలు త్రివిక్రమ్ శ్రీనివాస్‌ను ప్రశ్నించాలని కోరుకుంటున్నాను" అని ఎక్స్‌లో ట్వీట్ చేశారు.

**'మా'లో ఎప్పుడు ఫిర్యాదు చేసిందో తెలీదు**

పూనమ్ కౌర్ వ్యాఖ్యలపై దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ స్పందించారు. "పూనమ్ కౌర్ 'మా'లో ఫిర్యాదు ఎందుకు చేశారో.. ఎప్పుడు చేశారో మాకు తెలియదు. అప్పటికి కమిటీ ఏర్పాటై ఉంటే .. ఫిర్యాదు బాక్స్‌లో ఆమె తన కంప్లైంట్‌ను వేసి ఉంటే సరిపోయేది. ఫిర్యాదు లేకుండా ముందుకెళ్లలేం. 'మా' వాళ్లు ఆ ఫిర్యాదును మాకు పంపించి ఉన్నా.. చర్యలు తీసుకునేవాళ్లం. ఇప్పటికైనా ఫిర్యాదు అందిస్తే ముందుకు వెళ్తాం" అని పేర్కొన్నారు.

## ఆ గొప్పతనం చాటేలా..



నోయల్, రిషిత నెల్లూరు హీరోహీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'బహిర్భూమి'. రాంప్రసాద్ కొండూరు దర్శకత్వంలో మచ్చ వేణుమాధవ్ నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత మచ్చ వేణుమాధవ్ మాట్లాడుతూ "సినిమా చాలా కొత్తగా ఉంటుంది. ఎంతో ధైర్యంతో చేసిన చిత్రమిది. ఈ సినిమా విజయంపై పూర్తి నమ్మకం ఉంది" అని చెప్పారు. "ఈ సినిమాలో నోయెల్, పణి మధ్య వచ్చే కామెడీ సీన్స్ సినిమాకే హైలైట్ అవుతాయి. ఈ సినిమాకు ఈ టైటిల్ ఎందుకు పెట్టామో.. సినిమా చూస్తే తెలుస్తుంది. మన కల్చర్‌లోని గొప్పతనాన్ని చాటే చిత్రమిది" అని దర్శకుడు రామ్‌ప్రసాద్ కొండూరు అన్నారు. "చాలా మంచి చిత్రం చేశాం. ప్రేక్షకులకు కావాల్సిన అన్ని అంశాలు ఇందులో పుష్కలంగా ఉన్నాయి" అని హీరో నోయెల్ తెలిపారు. ఈ సినిమాకు సినిమాటోగ్రఫీ: ప్రవీణ్ కోమరి, సంగీతం: అజయ్ పట్నాయక్.

# గ్యాంగ్ గ్యాంగ్ గ్యాంగ్‌స్టర్స్

**కథానాయకులు ఒకప్పుడు రాముడు మంచి బాలుడు తరహా పాత్రలు మాత్రమే చేయడానికి ఆసక్తి చూపేవారు. ఆ తర్వాత గ్రే షేడ్స్ ఉన్న పాత్రలకు సైతం సై అని బాక్సాఫీస్‌కు కళ తెచ్చారు. 1970 దశకంలో మొదలైన ఈ హడావుడి. ఇప్పటికీ ఎవర్‌గ్రీన్ ఫార్ములాగా వెండితెరను ఏలుతోంది. డాన్.. గ్యాంగ్‌స్టర్.. బూట్ లెగ్గర్ ఇలా ఎన్ని పేర్లతో ఈ పాత్రలు తెరపైకి వచ్చినా.. కథానాయకులు మాత్రం ఈ రోల్‌లో ఒక్కసారి అయినా కనిపించాలని కోరుకుంటుంటారు. కొందరు కథానాయకులు అయితే ఇదే తరహా పాత్రలకు బ్రాండ్‌గా మారిన సందర్భాలూ అనేకం. అలా త్వరలో వెండితెరపై తళుక్కుమననున్న గ్యాంగ్‌స్టర్ పాత్రధారులెవరో ఓ లుక్కేద్దాం.**




సుజీత్ దర్శకత్వంలో పవన్‌కల్యాణ్ నటిస్తున్న చిత్రం 'దే కాల్ హిమ్ ఓజీ'. ఇందులో పవన్ గ్యాంగ్‌స్టర్‌గా కనిపించనున్నారు. జపాన్..కోల్‌కతా నేపథ్యంలో సాగే ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామాపై అంచనాలు ఇప్పటికే పీక్స్‌లో ఉన్నాయి. ఇప్పటికే ఈ సినిమా గ్లింప్స్ విడుదలై సినిమా ఏ రేంజ్‌లో ఉంటుందో ప్రేక్షకులకు హింటిచ్చింది. ఇది వరకే 'బాలు', 'పంజా' చిత్రాలలో పవన్ గ్యాంగ్‌స్టర్‌గా కనిపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను మొదట ఈ నెల 27న విడుదల చేయాలనుకున్నారు. కానీ ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎంగా పవన్ ఎన్నికవ్వడం.. ఆయన రాజకీయాలకే ఎక్కువ సమయం కేటాయిస్తుండడంతో ఈ సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందనేది దానిపై మేకర్స్ నుంచి అప్‌డేట్ లేదు.

### అచ్చొచ్చిన పాత్రలో...

తమిళ నటుడు అజిత్ ఇప్పటివరకూ ఎన్నో పాత్రల్లో కనిపించారు. అయితే, గ్యాంగ్‌స్టర్ పాత్రలతో ఆయన తనకంటూ విశేష గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన ఇప్పటికే 'బిల్లా', 'బిల్లా 2', 'గ్యాంబ్లర్' వంటి పలు చిత్రాల్లో గ్యాంగ్‌స్టర్‌గా కనిపించి మెప్పించారు. ఇప్పుడు అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో ఆయన నటిస్తున్న చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. ఇందులోనూ ఆయన గ్యాంగ్‌స్టర్‌గా కనిపించనున్నారు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ చిత్రం నుంచి విడుదలైన పోస్టర్స్ సినిమాలో అజిత్ పాత్రలో ఎన్నో వేరియేషన్స్ ఉంటాయనే హైప్ క్రియేట్ చేశాయి. ఈ సినిమా వచ్చే ఏడాది విడుదల కానుంది.



### ఖురేషి అబ్రహాంగా

మలయాళ నటుడు మోహన్‌లాల్ నటించిన దాదాపు అరడజనుకుపైగా సినిమాల్లో ఆయన గ్యాంగ్‌స్టర్‌గా కనిపించారు. 2019లో పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో మోహన్‌లాల్ నటించిన చిత్రం 'లూసీఫర్'. ఆయన ఇందులో సినిమా మొదటి నుంచి చివరి వరకు స్టీఫెన్ గట్టుపల్లి అనే రాజకీయనాయకుడి పాత్రలో కనిపిస్తారు. సినిమా ఎండ్ క్రెడిట్స్‌లో ఆయన గ్యాంగ్‌స్టర్ ఖురేషీ అబ్రహాంగా కనిపించి ప్రేక్షకులను థ్రిల్ చేస్తారు. ఇప్పుడు ఖురేషీ పాత్రపై 'లూసీఫర్'కు సీక్వెల్‌గా 'ఎల్ 2 ఎంపురాన్' అనే చిత్రం వస్తోంది. ఎంపురాన్ అంటే రాజుకు ఎక్కువ.. దేవుడికి తక్కువ అనే అర్థం వచ్చేలా తెరకెక్కుతోన్న ఈ సినిమాపై అంచనాలు ఓ రేంజ్‌లో ఉన్నాయి.

### డెడ్లీ డాన్‌గా...

తమిళ సినిమాల్లో డాన్ పాత్రను పోషించాలంటే టక్కున గుర్తొచ్చే నటుల్లో సూపర్‌స్టార్ రజనీ ఒకరు. ఆయన ఇది వరకే 'రంగా', 'బిల్లా', 'బాషా' 'కాలా' 'కబాలి' వంటి చిత్రాల్లో గ్యాంగ్‌స్టర్‌గా అదరగొట్టారు. ఆయన నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'కూలీ'. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో వస్తోన్న ఈ సినిమాలో రజనీకాంత్ డెడ్లీ డాన్‌గా కనిపించనున్నారు. గోల్డ్ స్మగ్లింగ్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కే ఈ చిత్రంలో నాగార్జున 'సైమన్' అనే విలన్ పాత్రలో నటిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.







### రోలెక్స్‌గా..

తమిళ నటుడు సూర్య ప్రతీ చిత్రంతో తన వైవిధ్యమైన నటనతో అలరిస్తుంటారు. తను ఎంచుకునే పాత్రల్లో ఎన్నో షేడ్స్ చూపించే ఆయన.. ఇది వరకే 'ఆరు', 'నంద', 'సికందర్' సినిమాల్లో గ్యాంగ్‌స్టర్‌గా కనిపించి రాణించారు. ఇప్పుడు ఆయన లోకేశ్ కనగరాజ్ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా.. 'విక్రమ్' సినిమా క్లైమాక్స్‌లో 'రోలెక్స్'గా కనిపించిన సంగతి తెలిసిందే. ఆయన తెరపై కనిపించింది ఐదు నిమిషాలే అయినా.. ఆ కొద్దిసేపటికే థియేటర్లు 'రోలెక్స్'.. 'రోలెక్స్' అంటూ దద్దరిల్లాయి. 'రోలెక్స్' క్యారెక్టర్‌తో రెండు సినిమాలను ప్లాన్ చేస్తున్నారు లోకేశ్. ఈ సినిమాల్లోనే కాకుండా ఆయన.. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో నటిస్తున్న చిత్రంలోనూ గ్యాంగ్‌స్టర్‌గా మెరవనున్నారు. ఈ సినిమా వర్కింగ్ టైటిల్ 'సూర్య 44'. అలాగే, సుధా కొంగర దర్శకత్వంలో నటిస్తున్న చిత్రంలోనూ సూర్య గ్యాంగ్‌స్టర్‌గా కనిపించనున్నారని టాక్.

### పీరియాడిక్ గ్యాంగ్‌స్టర్ డ్రామా



తమిళ నటుడు కార్తీ కూడా ఓ గ్యాంగ్‌స్టర్ చిత్రంలో నటిస్తున్నారు. 'కార్తీ 29' వర్కింగ్ టైటిల్‌గా తమిళ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాలో ఆయన గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించనున్నారు. కార్తీ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ బడ్జెట్‌తో నిర్మితమవుతున్న ఈ పీరియాడిక్ గ్యాంగ్‌స్టర్ డ్రామా వచ్చే ఏడాది ప్రేక్షకులను పలకరించనుంది.

# విశ్వబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి

**కలెక్టర్ అంబేడ్కర్ ● జిల్లా వ్యాప్తంగా విశ్వ కర్మ జయంతి**



విశ్వకర్మ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

**కలెక్టరేట్, సెప్టెంబరు 15:** జిల్లాలోని విశ్వబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో దైవిక వాస్తు శిల్పి, విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగవాన్ విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భగవాన్ విశ్వకర్మ విశ్వ సృష్టికర్త అని పేర్కొన్నారు. అత్యంత ప్రాధాన్యం ఉండటం వల్ల విశ్వకర్మ జయంతిని ప్రభుత్వ పండగలా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుందని, కేంద్ర ప్రభుత్వం విశ్వకర్మ యోజన ప్రత్యేక పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. ఆ పథకాన్ని అర్హులకు అందే విధంగా కృషి చేస్తామన్నారు. జేసీ సేతు మాధవన్ మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలోని విశ్వకర్మ ఆరాధన అనాధిగా వస్తున్న ఆచారమన్నారు. బీసీ సంక్షేమాధికారి కె.సందీప్ కుమార్, డీఆర్వో అనిత, జిల్లా విశ్వ బ్రహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షులు కె.ఆచారి, కన్వీనర్ టేకు సత్యనారాయణ, వ్యవసాయ శాఖ జేడీ రామారావు, సర్వే శాఖ ఏడీ త్రివిక్రమరావు ఉన్నారు.

**రాజాం రూరల్:** పట్టణంలోని కస్పావీధిలో శ్రీ కామాక్షి విశ్వబ్రాహ్మణ సొసైటీ ఆధ్వర్యంలో శ్రీమద్విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలు మంగళవారం నిర్వహించారు. సప్తవర్ణ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. కుంకుమపూజల్లో మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ముగడ శ్రీనివాసరావు, ముంతా రమేష్, సింహాద్రి ఆనంద్, మండా శ్రీధర్, జువ్వాది సురేష్, సందతు, చంద్రరావు, సంతోష్, శ్రీను, గణేష్, జగదీష్, సంగమేశ్వరావు తదతరులు పాల్గొన్నారు. ● **బొబ్బిలి:** బొబ్బిలి పట్టణంలో పలుచోట్ల విశ్వ కర్మజయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. రైల్వేస్టేషన్‌లో ఎస్ఎస్ఈ కార్యాలయం ఆవరణలో విశ్వకర్మభగవాన్ పూజలను ప్రారంభిం చారు. రైల్వేఎస్ఎస్ఈ ఇన్‌చార్జి కుమార్ కౌశల్, ఎస్‌ఏ ఖాన్, శ్రామిక్ యూని యన్ కేంద్ర ఆఫీస్ బేరర్ బీవీ రమణ, శ్రామిక్ కా ంగ్రెస్ యూనియన్ ప్రతి నిధి ఈశ్వరరావు తదితరుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా వేదపండితుల సమ క్షంలో పూజలు చేశారు. పాత కోటలో కార్పెంటర్ అలజంగి శ్రీను ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలలో సీఐ కటకం సతీష్‌కుమార్ తదితరులు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తారకరామాకాలనీ విశ్వబ్రాహ్మణ వీధిలో శ్రీ విరాట్ విశ్వకర్మజయంతి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కంచరవీధి శ్రీ బ్రహ్మంగారి ఆలయంలో వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ మూడు రోజుల పాటు స్వామి వారి జీవితవిశేషాలు, కాలజ్ఞానంపై డాక్టర్ అండలూరి సోమేశ్వరరావు ప్రవచనాలుంటాయని వారు తెలిపారు.





రాజాం కస్పావీధిలో..

బొబ్బిలిలో తారకరామ కాలనీలో..

## పని తీరు మెరుగుపడాలి

**కలెక్టరేట్:** మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పని తీరు మరింత మెరుగు పడాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. ఆయాశాఖల పని తీరుపై మంగళవారం సాయంత్రం కలెక్ట రేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది పని తీరు మెరుగుపడాలని, నిర్లక్ష్యతను విడనాడాలని సూచించారు. ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. యాచక వృత్తిలో ఉన్న 19 మంది బాలలను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించామని చెప్పగా, వారి ప్రస్తుత పరిస్థితిపై తనకు రెండు రోజుల్లో నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఐసీడీఎస్ పీడీ శాంతి, సీడీపీవోలు ఉన్నారు.

## నేడు స్కూల్ గేమ్స్ ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

**విజయనగరం టౌన్:** జిల్లా కేంద్రంలోని రాజీవ్ క్రీడా మైదానంలో ఈ నెల 18న అండర్- 14, 17 విభాగాల్లో బాల బాలికల ఫుట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నారని జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి కె.కృష్ణంరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు ఉదయం 9 గంటలకు వారి స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు తీసుకురావాలని కోరారు

## టెన్నీకాయిట్ జాతీయ పోటీలకు ఇందు

**విజయనగరం టౌన్:** శ్రీకాకుళంలో ఈ నెల 13 నుంచి 15 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి టెన్నీకాయిట్ పోటీల్లో ప్రతిభ చూపిన జిల్లాలోని పెద్ద నడిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని కె.ఇందు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 29 నుంచి జమ్మూ కాశ్మీర్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో ఆమె పాల్గొంటుందని టెన్నీకాయిట్ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి ఎం.రామారావు తెలిపారు. ఎంపికైన ఇందును కార్యదర్శితోపాటు, అధ్యక్షులు కె.గోపాల్ అభినందించారు.

## సచ్చిదానంద శాస్త్రికి నివాళి

**విజయనగరం రూరల్:** పద్మశ్రీ పురస్కార గ్రహీత, హరికథకులు సచ్చిదానంద శాస్త్రికి మంగళవారం ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. మ్యూజిక్ అకాడమీ సభ్యులు, మండపాక రవి, ధవళ సర్వేశ్వరరావు, కళ్ల నిర్మలా భాగవతారిణి, పద్మ ప్రియ, బాలాజీ స్వామిలు సచ్చిదానంద శాస్త్రికి నివాళులు అర్పించారు.

## వందేభారత్‌కు హాల్ట్ ఏర్పాటు చేయాలి

**బొబ్బిలి:** దుర్గ్ నుంచి విశాఖపట్టణానికి సోమవారం నుంచి ప్రారంభమైన వందేభారత్ రైలుకు బొబ్బిలిలో హాల్ట్ పెట్టాలని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహననాయుడుకు స్వయంగా కలిసి వినతిపత్రం అందజేసినట్లు జనసేన రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పాలూరు బాబు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. పార్వతీపురంలో ఈ రైలుకు హాల్ట్ ఏర్పాటు చేసినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపామన్నారు. బొబ్బిలిలో ఏపీఐఐసీ గ్రోత్‌సెంటరుతో పాటు రాయ్‌పూర్ నుంచి పెద్దఎత్తున వ్యాపార కార్యకలాపాలు నిర్వహించేందుకు బొబ్బిలి ప్రాంతానికి చెందిన వ్యాపారులు రాకపోకలు సాగిస్తారని, విశాఖపట్టణానికి పెద్దసంఖ్యలో విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, ఆసుపత్రుల అవసరాల కోసం రోగులు ప్రతిరోజూ వేల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారని మంత్రికి వివరించామన్నారు. దీనిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారన్నారు.

## చక్కెర పరిశ్రమలు తెరిపించాలి

**బొబ్బిలి రూరల్:** ఉమ్మడి జిల్లాలో మూతపడిన చక్కెర పరిశ్రమలను తెరిపించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్ గోపాలం ఆధ్వర్యంలో మంగళవారం రంగరాయపురం సచివాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ భీమసింగి చక్కెర పరిశ్రమ ఆధునీకరణకు నిధులు మంజూరు చేయాలని, లచ్చయ్యపేట ఎన్‌సీఎస్ చక్కెర పరిశ్రమను ప్రభుత్వ ం స్వాధీనం చేసుకుని తెరిపించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న చక్కెర పరిశ్రమలు మూత పడడంతో కార్మికులు రోడ్డున పడడంతో పాటు చెరకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. చెరకు సాగుపై ఆధారపడ్డ రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి చెరకు పరిశ్రమలను తెరిపించి రైతులను, కార్మికులను ఆదుకోవాలని, లేనిచో పోరాటం చేస్తామన్నారు. రైతు సంఘం నాయకులు రెడ్డి త్రినాథ, ఉడుముల ప్రసాదు, చెరకు రైతులు పాల్గొన్నారు.

## సీబీఎం పాఠశాల క్రయవిక్రయదారులపై కేసు నమోదు చేయాలి

**బొబ్బిలి రూరల్:** సీబీఎం స్కూల్ అక్రమ రిజిస్ట్రేషన్‌పై మంగళవారం ఏఐవైఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి కోట అప్పన్న ఆధ్వర్యంలో పట్టణంలోని యాదవ వీధిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కోట అప్పన్న మాట్లాడుతూ పట్టణ నడిబొడ్డున ఉండి ఎంతో పేరు ప్రఖ్యాతులు గాంచిన సీబీఎం స్కూల్ ఎవ్వరికీ తెలియకుండా చీపురుపల్లిలో రిజిస్ట్రేషన్ చేయడంలో అధికారుల పాత్ర ఉందన్నారు. సుమారు 100 కోట్లు విలువ చేసే పాఠశాల భూమిని కోమటిపల్లిలో ఉన్న పనికిరాని విలువ లేని భూములతో బదలాయింపు చేసామని, కొనుగోలు చేయలేదని పత్రికా ముఖంగా తూముల భాస్కరరావు చెప్పటం హాస్యాస్పదం అన్నారు. పేద విద్యార్థులకు విద్యను అందించే ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలను కారు చవుకగా కొనుగోలు చేయటం చట్టరీత్యా నేరం అని, తక్షణమే ప్రభుత్వం స్పందించి సీబీఎం స్కూల్ అక్రమ రిజిస్ట్రేషన్‌పై సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని అఖిల భారత విద్యార్థి యువజన సంఘాలు, డిమాండ్ చేశాయి. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేసి సీబీఎం స్కూల్‌ను కాపాడుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు తులసి, అరుణ్ కుమార్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆయిల్ దుకాణాలపై విజిలెన్స్ దాడులు

**● కాలంచెల్లిన నూనె ప్యాకెట్లు సీజ్**

**విజయనగరం(ఆంధ్రజ్యోతి)/శృంగవరపుకోట:** ప్రభుత్వం ఇచ్చిన లైసెన్సులకు కాలం చెల్లినప్పటికీ వ్యాపారాలు చేస్తూ.. ప్రజారోగ్యానికి, ప్రభుత్వానికి నష్టం కలిగిస్తున్న వ్యాపారులపై మంగళవారం విజిలెన్స్ దాడులు నిర్వహించారు. ఈ మధ్య కాలంలో వంటనూనెలపై కష్టమ్స్ సుంకం పెంచటంతో పామాయిల్, ఈడిబుల్ ఆయిల్ ధరలు పెరగనున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అయ్యాయి. దీంతో రాష్ట్రస్థాయిలో సంబంధిత అధికారులు అప్రమత్తమయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా వంటనూనె అమ్మకాలు జరిపే వ్యాపారులు, స్టాక్‌పాయింట్లు, మిల్లులపై విజిలెన్స్ దాడులు నిర్వహించారు. దీంట్లో భాగంగా జిల్లాలోని ఎస్.కోటలో విజిలెన్స్ దాడులు నిర్వహించారు. యడ్లవీధిలో గల విజయకృష్ణ ట్రేడర్స్, అరుకు రోడ్డులో గల లక్ష్మీనారాయణ ట్రేడర్స్ ఆయిల్ దుకాణాల్లో తనిఖీచేశారు. 78 రైస్‌బ్రాన్ ఆయిల్ ప్యాకెట్లు కాలంచెల్లినవిగా గుర్తించారు. అదే విధంగా 3,230 లీటర్లు పామాయిలను కూడా సీజ్ చేశారు. లైసెన్స్ రెన్యువల్ చెయకుండా కాలం చెల్లిన పత్రాలతో వ్యాపారాలు సాగిస్తున్న వ్యాపారులపై కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంటు సీఐ సింహాచలం, లీగల్‌మెట్రాలజీ ఎస్.ఐ దామోదరరావు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, తూనికలు కొలతల అధికారులు పాల్గొన్నారు.



ఎస్‌కోటలో ఆయిల్ షాపుల్లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

## ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

**● ఎస్పీ వకుల్ జిందాల్**

**విజయనగరం క్రైం, సెప్టెంబరు 17:** డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ మోసగాళ్ల వీడియోకాల్స్ చేసి మోసాలకు పాల్పడుతున్నారని, ఇటువంటి వారి పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ వకుల్ జిందాల్ సూచించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ తరహా కాల్స్, లింక్స్, వీడియోకాల్స్‌తో సైబర్ మోసగాళ్ల ప్రజలకు ఉచ్చు వేస్తూ వారిని భయపెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. ప్రజల మొబైళ్లకి ఫోన్ చేసి తాము ఫెడెక్స్, బ్లూ డాట్ కొరియర్స్ నుంచి మాట్లాడుతున్నామని, చిరునామా, ఆధార్ నెంబరు, ఫోన్ నెంబరు వంటి సమాచారాన్ని ముందుగా చెప్పి కొరియర్ పార్శిల్‌లో నిషేధిత మాదక ద్రవ్యాలు, ఫేక్‌పాస్‌పోర్టు, బంగారం బిస్కెట్లు ఉన్నాయని, మనీ లాండరింగ్‌కు పాల్పడుతున్నట్టు గుర్తించామని, మాదక ద్రవ్యాలు తైవాన్, ఇరాన్, చైనా వంటి దేశాలకు పంపుతున్నట్టు నిర్ధారణ అయిందని, దీంతో మీపై కేసు నమోదైందని చెప్పి బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. విచారణ నిమిత్తం సుదూర ప్రాంతానికి రావాల్సి ఉంటుందని చెప్పి బెదిరించి డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్నారు. సైబర్ మోసగాళ్ల పంపిన లింక్స్ క్లిక్ చేస్తే బ్యాంకు సేవింగ్ ఖాతాలోని నగదు చోరీకి గురవుతుందన్నారు. బిట్‌కాయిన్, క్రిప్టో కరెన్సీ పేరుతో తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని ప్రజలను నమ్మించి పెట్టుబడి పెట్టిన నగదుకు అధికంగా పెరిగినట్టుగా ఆన్‌లైన్‌లో చూపుతారని, పెరిగిన సొమ్ము తీసుకోవాలంటే మార్జిన్ రూపంలో తిరిగి డబ్బులు కట్టాలని లేదంటే డబ్బులు ఇవ్వడం కుదరదని చెప్పి మోసాలకు పాల్పడుతున్నారన్నారు. ఇటువంటి మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ జిందాల్ కోరారు.

## నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు తినొద్దు

**● డీఎంహెచ్‌వో భాస్కరరావు**



వైద్య శిబిరంలో డీఎంఅండ్‌హెచ్‌వో

**కొత్తవలస:** ఒడిసాకు చెందిన సుమారు 100 మంది కూలీలు కొత్తవలస రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటూ రైల్వే కాంట్రాక్టర్ వద్ద పనిచేస్తున్నారు. వీరు తాము ఉన్న ప్రాంతంలోనే వంటలు చేసుకుంటూ ఉంటారు. ఇటీవల వరుసగా వినాయక నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా ఏర్పాటు చేస్తున్న అన్నదాన కార్యక్రమాలకు వెళ్లి అక్కడే భోజనాలు చేసి అన్నం కూరలను తెచ్చుకుని నిల్వ ఉంచుకుని రాత్రి పూట తినడంతో 8మంది కూలీలు ఆదివారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిని విశాఖపట్టణం కేజీహెచ్‌కు తరలించగా వీరిలో నలుగురు సాధారణ స్థితికి రావడంతో డిశ్చార్జ్ అయి సోమవారం కొత్తవలస చేరుకున్నారు. మరో నలుగురికి కేజీహెచ్‌లో చికిత్స అందిస్తున్నారు. మిగిలిన కూలీలకు ఎటువంటి సమస్యలేకుండా సోమవారం కొత్తవలస పీహెచ్‌సీ వైద్యాధికారి సీతల్ వర్మ కొత్తవలస రైల్వేస్టేషన్ వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేసి కూలీలకు చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి భాస్కరరావు వైద్య శిబిరాన్ని సందర్శించి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నిల్వఉంచిన ఆహార పదార్థాలను తినొద్దని ఈసందర్భంగా కూలీలకు సూచించారు. ఈఓపీఆర్డీ ధర్మారావు, కొత్తవలస సర్పంచ్ మచ్చ ఎర్రయ్య స్వామి పాల్గొన్నారు.

## సంతనిర్వహణపై కమిటీ అసంతృప్తి

**● అన్నీ బాగున్నాకే సంతకాలు పెడతామన్న అధికారులు**



నీటికుండీలు పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

**జామి:** మండలంలోని లోట్లపల్లి సంతనిర్వహణ కమిటీ సమావేశం మంగళవారం గ్రామ సచివాలయంలో జరిగింది. ఈ సమావేశానికి ఆర్‌టీవో, మార్కెటింగ్‌శాఖ అధికారులు డుమ్మాకొట్టగా కమిటీ సభ్యుడిగా ఉన్న ఎస్ఐ కాకుండా ఏఎస్ఐ హాజరయ్యారు. కమిటీ సమావేశం మొదలయిన కాసేపటికి అధికారుల వ్యవహారశైలి బాగోలేదంటూ సంత నిర్వాహకులు కలెక్టర్‌ను ఆశ్రయిస్తామని వెళ్లిపోయారు. ఈ సమావేశానికి డీఎల్‌పీవో మోహన్‌రావు హాజరయ్యారు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో తహసీల్దార్ కృష్ణలత హాజరయ్యారు. అనంతరం ప్రస్తుతం ఉన్న సభ్యులు సంతస్థలాన్ని పరిశీలించారు. అయితే సంతనిర్వహణ బాగోలేదని అసంతృప్తి వ్యక్తంచేశారు. పశువులకు నీరుపెట్టే కుండీల్లో నీరు దారుణంగా ఉంది. దాణా కుళ్లు వాసనతోపాటు పురుగులు నిండి ఉన్నాయి. పశువులను వ్యాన్‌లోకి ఎక్కించే ర్యాంప్‌లు బాగోలేదు. సంతస్థలం అపరిశుభ్రంగా వుంది. ఇవిచూసిన అధికారులు నిర్వహణ బాగోలేదని, మరోసారి చుద్దామని కమిటీకి ప్రతినిధిగా వ్యవహరించిన ఈవోపీఆర్‌డీ శ్రీదేవి, కార్యదర్శి ఎర్నమ్మకు చెప్పారు. రిజిస్టర్‌లో సంతకం పెట్టాలని తహసీల్దార్‌ను కార్యదర్శి, ఈవోపీ ఆర్‌డీ కోరగా ఒకింత అసహనం వ్యక్తంచేశారు. గోసమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ సంతస్థలంలో విరిగి పడి ఉన్న పశువుల కొమ్ములను చూపిస్తూ ఇక్కడ జీవహింస జరుగుతుందని, వీటిని కూడా పరిశీలించి సంత రెన్యూవల్ ఇవ్వాలని కోరారు.

## వరద బాధితులకు పలువురి వితరణ

**బొబ్బిలి రూరల్:** విజయవాడ ప్రాంతంలో వరదల వల్ల నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు బొబ్బిలి గ్రీన్ బెల్ట్ సొసైటీ సభ్యులు తమవంతుగా రూ.22,000, ఆర్‌కె చౌదరి బ్రదర్స్ రూ 1,50,000 తదితరులు వితరణ అందించారు. నియోజకవర్గ వ్యాప్తంగా పలువురు ఎమ్మెల్యే బేబీనాయనకు వితరణ అందించారు.

**విజయనగరం రూరల్:** విజయనగరం పట్టణంలోని 6వ డివిజన్‌కు చెందిన ప్రజా ప్రతినిధులు సహాయం నిమిత్తం రూ.62,690లు, తెలుగు యువత నియోజకవర్గం అధ్యక్షులు గంటా రవి రూ.20వేలు అందజేశారు. మొత్తం రూ 82,690 చెక్కును స్థానిక ఎంఎల్‌ఏ పూసపాటి అదితి గజపతిరాజుకు అందించారు.

**రేగిడి:** విజయవాడ వరద బాధితులకు అపన్నహస్తం అందించేందుకు రేగిడి మండల టీడీపీ ముందుకు వచ్చింది. ఈ మేరకు మంగళవారం రాజాం కోండ్రు క్యాంప్ కార్యాలయంలో రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహనరావు, ఆయన సోదరుడు రాజాం టీడీపీ నేత కోండ్రు జగదీష్ సమక్షంలో టీడీపీ నేతలు వసూళ్లు చేసిన రూ. 9లక్షల వరకు నగదు అందించినట్లు మండల టీడీపీ అధ్యక్షుడు కిమిడి అశోక్‌కుమార్, టీడీపీ నేత డీసీసీబీ మాజీ ఉపాధ్యక్షుడు దూబ ధర్మారావు వెల్లడించారు. మండలంలో 39 పంచాయతీల నుంచి 12 లక్షల వరకు వసూలు చేసి వరద బాధితులకు అపన్నహస్తం అందించేందకు మండల టీడీపీ పార్టీ తీర్మానించినట్లు వీరు వెల్లడించారు. నగదు అందించిన నేతల్లో పాలూరి రామినాయుడు, గురవాన ధనంజయ్‌రావు, బుడి ఆదినారాయణ, డీలర్ చింతు సత్యంనాయుడు, కరణం వెంకటరమణ, చింత లక్ష్మిరాజ్యాం తదితరులు ఉన్నారు.



బేబీనాయనకు విరాళం అందిస్తున్న విద్యార్థులు

**రాజాం రూరల్:** ఇటీవల సంభవించిన వరదలతో అట్టుడికిపోం యిన విజయవాడ వరద బాధితులకు తెదేపా వంగర నాయకులు ఆపన్న హస్తం అందజేశారు. తెదేపా సీనియర్ నాయకులు, మాజీ జడ్పీటీసీ బొత్స వాసుదేవరావు నాయుడు, పిన్నింటి మోహనరావు, లచ్చుభుక్త కృష్ణమూర్తి తదతరులు సేకరించిన రూ.5 లక్షల మొత్తాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేశారు. ఆ మొత్తాన్ని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్‌కు మంగళవారం తెదేపా నాయకులు అందజేశారు. రేగిడి మండలం వావిలవలసకు చెందిన రిటైర్డ్ తహసీల్దార్ పాలూరు రామినాయుడు ఆధ్వర్యంలో సేకరించిన రూ.60వేల మొత్తాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు.

## ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు

**బొబ్బిలి:** ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని స్థానిక శ్రీ ఆంజనేయస్వామి ఆలయం దగ్గర బుధవారం బీజేపీ సీనియర్ నేత పుల్లెల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సాధువులకు అల్పాహారం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ● **శృంగవరపుకోట:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన సందర్భంగా శృంగవరపుకోట శ్రీదుర్గాదేవి ఆలయంలో మంగళవారం స్థానిక భారతీయ జనతాపార్టీ నాయకులు డి.సూర్యారావు, ఎలమంచిలి ప్రసాద్, పార్వతీదేవి దాశెట్టి దాశరది ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన మంత్రి మోదీకి భారత దేశాన్ని ప్రపంచంలో అగ్రగామిగా ఉంచేందుకు శక్తిని ఇవ్వాలని కోరారు.

## ప్రమాదాలు జరిగే ప్రాంతాల పరిశీలన

**బొబ్బిలి:** రోడ్డు ప్రమాదాల నివారణ కోసం అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం పట్టణ పరిధిలో బొబ్బిలి-పార్వతీపురం-రామభద్రపురం రాష్ట్రీయరహదారి, తెర్లాం రహదారిలో నాలుగు ప్రాంతాలను తరచూ ప్రమాదాలు జరిగే బ్లాక్‌స్పాట్లగా గుర్తించారు. సీఐ కటకం సతీష్‌కుమార్, ఆర్‌అండ్‌బీ జేఈ రాజు, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్, మున్సిపల్ ఏఈ రవి, ఎస్ఐ జ్ఞానప్రసాద్ తదితరులు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను పరిశీలించారు. ఈ ప్రాంతాలలో ప్రమాదాలు ఎందుకు జరుగుతున్నాయన్నదానిపై అధ్యయనం చేశారు. ఈ ప్రాతిపాదనలను ఉన్నతాధికారులకు పంపిస్తామని, తదుపరి ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని సీఐ సతీష్‌కుమార్ తెలిపారు.

**రాజాం రూరల్:** రాజాం పట్టణం కేంద్రంగా నాలుగు ప్రధాన మార్గాలలో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్న నాలుగు బ్లాక్‌స్పాట్లను గుర్తించామని రాజాం టౌన్ సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. మున్సిపల్ కమిషనర్ రామఅప్పల నాయుడు, ఆర్‌అండ్‌బీ ఏఈ నాగభూషణరావుతో కలిసి చీపురుపల్లి రోడ్‌లోని గాయత్రి కాలనీ ప్రాంతంతో పాటు బొబ్బిలి రోడ్‌లోని కంచరాం, శ్రీకాకుళం రోడ్‌లోని అంతకాపల్లి, పాలకొండ రోడ్‌లోని గురవాం గ్రామ సమీపంలో తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నట్లు గుర్తించినట్లు ఆయన వెల్లడించారు. గుర్తించిన ప్రదేశాల్లో ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు వంటివి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.



బొబ్బిలి: బ్లాక్‌స్పాట్లను పరిశీలిస్తున్న పోలీసులు, అధికారులు



రాజాం: గాయత్రి కాలనీ సమీపంలో పరిశీలిస్తున్న అధికారులు

## గోడ కూలి కళాసీ మృతి

**సాలూరు:** గోడ కూలి కళాసీ మృతిచెందిన ఘటన సాలూరులో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాలూరు పట్టణంలోని కొంకి వీధిలో కొంకి పెట్టయ్య అనే వృద్ధుడు మంగళవారం మృతిచెందాడు. ఆ మృతదేహానికి ఎండ తగలకుండా ఉండేందుకు పక్క ఇంట్లో ఉన్న హరి తౌడు (48) (ఆర్టీసీలో కళాసి) టెంట్ కడదామని చిన్నపాటి గోడ ఎక్కేందుకు ప్రయత్నిం చగా, ఆ గోడ కూలిపోయింది. దీంతో తౌడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య గౌరి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శవపంచనామా నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పట్టణ సీఐ అప్పలనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

## పాము కాటుతో గిరిజనుడి మృతి

**పాచిపెంట:** పాము కాటుతో ఎగువగొట్టూరుకు చెందిన సేబి శ్రీను(24) మంగళవారం మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. శ్రీను తన కుటుంబంతో సోమవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో పాము ఇంటిలోనికి చొరబడింది. తన పెద్ద కుమార్తెపై నుంచి పాకడంతో ఆమె పెట్టిన కేకలకు తండ్రి శ్రీను వెంటనే మేల్కొన్నాడు. ఆ పామును తన కుడి చేతితో పట్టుకుని విసిరేసే సమయంలో పాము చేయిపై కాటేసింది. నొప్పి లేకపోవడంతో తర్వాత రోజు ఆసుపత్రికి వెళ్తానని కుటుంబీకులకు చెప్పాడు. మంగళవారం ఉదయం 7 గంటల సమయంలో మండలంలోని గురువునాయుడుపేట తీసుకువెళ్లారు. అక్కడ నుంచి సాలూరు సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీను మృతిచెందాడు. మృతుడు శ్రీనుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## కొట్లాట కేసులో ఏడేళ్ల జైలు

**డెంకాడ:** చింతలవలస గ్రామానికి చెందిన ఎం అప్పలనాయుడుకు వారి కుటుంబ సభ్యులకు 2020 సంవత్సరంలో ఇంటి స్థలం విషయంలో వివాదం చెలరేగింది. ఇరు వర్గాలు కొట్లాటకు దిగడంతో పోలిపల్లి ఉమ తలకు బలంగా గాయమవడంతో చనిపోయాడు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడు అప్పలనాయుడుకు విజయనగరం ఏడీజే కోర్టు ఐపీసీ 304-2 సెక్షన్ ప్రకారం ఏడు సంవత్సరాలు జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించినట్లు డెంకాడ ఎస్ఐ తెలిపారు.

## సారా స్వాధీనం

**మెంటాడ:** వాణిజ గ్రామ సమీపంలో మంగళవారం అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తుల నుంచి 30 లీటర్లు సారా స్వాధీనం చేసుకున్నట్లు ఆంద్ర ఎస్.ఐ సీతారాం తెలిపారు. సారా తరలిస్తున్న ద్విచక్రవాహనం సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు.

## ఇసుక అక్రమ రవాణా.. ట్రాక్టర్ సీజ్

**సంతకవిటి:** ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై గోపాలరావు తెలిపారు. మండలంలోని హోంజరాం సమీపంలోని నాగావళి నది నుంచి ఇసుకను తరలిస్తుండగా సిరిపురం గ్రామ సమీపంలో ట్రాక్టర్‌ను ఆపి తనిఖీ చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండటంతో పట్టుకుని సంతకవిటి పోలీసు స్టేషన్‌కి తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## డీజే సౌండ్స్ నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

**బొబ్బిలి:** ఉత్సవాలు, వివాహాలు, ఊరేగింపులు వంటి కార్యక్రమాల్లో డీజే సౌండ్స్‌ను వినియోగించినప్పుడు కచ్చితంగా నిబంధనలు పాటించాలని సీఐ కటకం సతీష్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం రాత్రి స్థానిక పోలీసు స్టేషన్‌లో డీజే సౌండ్ ఎక్విప్‌మెంట్ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. అత్యధిక డిసిబుల్ సౌండ్స్‌తో డీజేలను వినియోగించడం జనం ప్రాణాలకు హానికరమని అన్నారు. పరిమితికి మించిన శబ్దాలతో డీజే ఎక్విప్‌మెంట్స్‌ను వినియోగించి ఏ ఒక్కరికీ అసౌకర్యం కలిగించరాదన్నారు. అలాగే నిర్ధిత వేళలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టప్రకారం డీజే సిస్టమ్స్‌ను సీజ్ చేస్తామని సీఐ సతీష్‌కుమార్ హెచ్చరించారు. అందరూ పోలీసు హెచ్చరికను అనుసరించాలని హితవు పలికారు. ఈ సమావేశంలో స్థానిక ఎస్ఐ ఆర్. రమేష్‌కుమార్, డీజే సౌండ్స్ నిర్వాహకులు పాల్గొన్నారు.

### డీజేలు, మందుగుండులపై నిషేధం

**లక్కవరపుకోట:** మండలంలోని వినాయక అనుపోత్సవంలో ఎవరు డిజే సౌండ్స్ భారీ ఎత్తున మందుగుండు సామగ్రిని వినియోగించరాదని ఎస్ఐ నవీన్‌పడాల్ ఒక ప్రకటనలో తెలిపారు. అనుపోత్సవం అనుమతించిన సమయాన్ని మించరాదన్నారు. అశ్లీల నృత్యాలు, రోడ్లపై బలవంతపు చందా వసూళ్ల పనికిరావన్నారు. చట్టాన్ని ఎవరు అతిక్రమించినా కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు.

## ప్రాంతీయ ఆస్పత్రికి గీజర్స్‌ను అందించిన ఎమ్మెల్యే

**శృంగవరపుకోట:** ఎస్.కోట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి గర్భిణులు, చిన్న పిల్లలకు వేడినీరు అందించేందుకు రెండు వాటర్ గ్రీజర్లను శాసన సభ్యురాలు కోళ్ల లలితకుమారి మంగళవారం అందించారు. ఆగస్టు 19న జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించేందుకు వచ్చిన సమయంలో వేడినీరు ఇవ్వడం లేదని గర్భిణులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దాతల సహకారం కోరడంతో కొత్తవలస మండలం మంగళపాలెం శ్రీగురుదేవ చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ జగదీష్ బాబు ముందుకు వచ్చారు. రూ.60వేలు విలువ చేసే రెండు వాటర్ గ్రీజర్‌లను సమకూర్చారు. వీటిని ఆసుపత్రిలో అమర్చాలని సూపరెండెంట్ డాక్టర్ నీలకు అప్పగించారు. మండల పార్టీ అధ్యక్షుడు జీ.ఎస్.నాయుడు, మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, క్లస్టర్ ఇన్‌చార్జి కాపుగంటి వాసు, ఐటీడిపి రాష్ట్ర కార్యదర్శి చక్కాకిరణ్, కొణదం మల్లేశ్వరరావు, పోట్నూరు అప్పలరాజు, వాకాడ బాలు తదితరులు వున్నారు.

## గృహాల ప్రారంభం

**వేపాడ:** మండలంలోని పాటూరు గ్రామంలో గౌరవ ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని పాటూరు గ్రామంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకంలో నిర్మించిన నూతన గృహాలను ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి, అధ్యక్షుడు వెంకటరావు, ఎస్.కోట మండల పార్టీ అధ్యక్షుడు జీఎస్.నాయుడు, వేపాడ మాజీ ఎంపీపీ దాసరి లక్ష్మి, గోగాడ జగన్నాధంనాయుడు, బుద్ద అప్పలనాయుడు, బోజంకి మహేష్, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు ఎంఈవోలతో పాఠశాల విద్య బలోపేతం

**● డిప్యూటీ డీఈవో మోహనరావు**



మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో మోహనరావు

**రామభద్రపురం:** ఇద్దరు ఎంఈవోలతో పాఠశాల విద్య మరింత బలోపేతం అవుతుందని డిప్యూటీ డీఈవో కె.మోహ నరావు అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో మంగ ళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎంఈవో-2 పోస్టులను ప్రభుత్వం ఎత్తివేస్తుందని వస్తున్న వార్తలు ఊహాగానాలే తప్ప ఏ విధమైన స్పష్టత లేదన్నారు. పరిపాలన అకడమిక్ సౌకర్యాల నిమిత్తం ఎంఈవో -1, ఎంఈవో-2లు కొనసాగించడం తో పాటు స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలకు కొద్దిపాటి అధికారాలు అప్పగిస్తే పాఠశాల విద్యాకు మరింత మేలు జరుగుతుందని ఉపాధ్యాయుల అభిప్రాయమన్నారు. పాఠశాలల్లో బాలికల కంటే బాలురు చదువులో వెనుకబడి ఉండడం వాస్తవమేనని వారికి ఇంటి దగ్గర తల్లిదండ్రుల పర్యవేక్షణ తగ్గుతోందన్నారు.

# పర్యావరణ పరిశుభ్రతలో భాగస్వాములు కండి

- జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలు ప్రారంభం
- రహదారులపై ర్యాలీలు, మానవహారాలు నిర్వహణ
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, నాయకులు, అధికారులు

ప్రతిఒక్కరూ పర్యావరణ పరిశుభ్రతలో భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యేలు, నాయకులు పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ర్యాలీలు నిర్వహించారు. మానవహారం ఏర్పాటుచేశారు. ఎమ్మెల్యేలు, అధికారులు, నాయకులు పరిశుభ్రతా కార్యక్రమాల్లో స్వయంగా పాల్గొన్నారు. రహదారులను ఊడ్చారు. చెత్తను తొలగించారు.
(ఆంధ్రజ్యోతి బృందం)



పాలకొండ: ర్యాలీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ


గుమ్మలక్ష్మీపురం: చెత్త ఊడుస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి



పార్వతీపురంటౌన్: ర్యాలీలో ఎమ్మెల్యే విజయచంద్ర



సాలూరు రూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు


జియ్యమ్మవలస: ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


వీరఘట్టంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



గరుగుబిల్లి: ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీవో పైడితల్లి


మక్కువ: ర్యాలీలో పాల్గొన్న అధికారులు


సీతంపేట రూరల్: మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

## మా పిల్లలకు టీసీ ఇచ్చి పంపించేయండి


విద్యార్థినుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీడీ, ఎస్ఐ

**కొమరాడ:** ఉలిపిరి గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాల ఎదుట మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. ఈ పాఠశాలలో సక్రమంగా విద్య అందడం లేదని, తమ పిల్లలకు టీసీ ఇచ్చి పంపించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పార్వతీ పురం గిరిజన సంక్షేమాధికారి రుక్మాండయ్య, కొమరాడ ఎస్ఐ నీలకంఠం ఆశ్రమ పాఠశాలకు చేరుకుని విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చలు జరిపారు. విద్యార్థుల తోనే పనులు చేయిస్తున్నారని, పిల్లలకు నాణ్యమైన విద్య అందడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. పాఠశాలలో ప్రిన్సిపాల్, హెచ్ఎంతో సహా వసతి గృహ సంరక్షకురాలిని తక్షణమే మార్పు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై ఉన్నతాధికారులతో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని గిరిజన సంక్షేమాధికారి తెలిపారు.

## ఆయిల్ షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు

**పార్వతీపురంటౌన్:** జిల్లా కేంద్రంలోని హోల్‌సేల్ ఆయిల్ షాపుల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, లీగల్ మెట్రాలజీ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ధరలపై ఆరా తీశారు. ఈసందర్భంగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ రామారావు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాష్ట్రం మొత్తం మీద హోల్‌సేల్ నూనె షాపుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అలాగే జిల్లా కేంద్రంలోని శ్రీసాయికిరణ్, శరణం ట్రేడర్స్‌ల్లో తనిఖీలు నిర్వహించామన్నారు. తనిఖీలకు సంబంధించి సమగ్ర నివేదికలను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు.

## తప్పుడు ప్రచారం తగదు

- మంత్రి సంధ్యారాణి

**సాలూరు:** తమపై తప్పుడు ప్రచారాలు తగవని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ఆమె మంగళవారం స్థానిక విలేకర్లతో ఫోన్‌లో మాట్లాడారు. ఆగస్టు 29న విజయవాడలోని తన నివాసంలో కొడుకు పుట్టినరోజు వేడుకలు జరుపుకొని, ఈనెల 1న కుటుంబ సభ్యులతో శ్రీవారి దర్శనం చేసుకుని, అనంతరం విజయవాడ వెళ్లానని చెప్పారు. అయితే కొందరు.. తాను, తన కుటుంబ సభ్యులు తిరుపతిలోని పద్మావతి గెస్ట్‌హౌస్‌లో తన కొడుకు పుట్టినరోజు వేడుకలు నిర్వహించినట్టు ఆరోపిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారన్నారు. ఇది తగదని, భగవంతుడు తప్పక వారికి శిక్షిస్తాడని అన్నారు.

**ప్రజాదరణ చూసి తట్టుకోలేకపోతున్నారు**

మంత్రి సంధ్యారాణికి వస్తున్న ప్రజాదరణ చూసి తట్టుకోలేకపోతున్నారని టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, జనసేన నాయకుడు శివకృష్ణ అన్నారు. వారు సాలూరులో మాట్లాడుతూ మంత్రిపై తప్పుడు ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## ఇసుక, గ్రావెల్ అక్రమంగా తరలిస్తే చర్యలు

- సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

**భామిని:** ఇసుక, గ్రావెల్ అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని పాలకొండ సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. ఆంధ్రజ్యోతిలో ఇటీవల ప్రచురితమైన 'కొండను తవ్వి.. రోడ్డు వేసి' కథనానికి సబ్ కలెక్టర్ స్పందించారు. ఈమేరకు మైనింగ్, రెవెన్యూ అధికారులతో కలిసి బురుజోల కొండను మంగళవారం సందర్శించారు. అక్రమంగా గ్రావెల్, ఇసుక తరలిస్తే సమాచారం అందించాలన్నారు. అనంతరం నేరడి ఇసుక ర్యాంప్‌ను పరిశీలించారు. అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని పట్టుకుని రూ.50వేలు మైనింగ్ అధికారి శిరీష అపరాధ రుసుం విధించారు. నేరడిలో డంపింగ్ ఇసుకను సీజ్ చేయాలని సబ్ కలెక్టర్ మైనింగ్ అధికారులకు ఆదేశించారు. అనంతరం తాలాడ ఇసుక ర్యాంప్‌ను సందర్శించారు. ఆయనతో పాటు ఎంఆర్ఐ ఎస్.రాంబాబు, సర్వేయర్ రాజేష్, విఆర్‌వోలు వెంకటరామ, యర్నాకర్, భారతి తదితరులు పాల్గొన్నారు.

## వరద బాధితులకు ఆర్థిక సాయం

**పాలకొండ:** విజయవాడ వరద బాధితులకు ఏపీ రైతు సంఘం తరఫున ఆర్థిక సాయం చేశారు. జిల్లా రైతు సంఘం సభ్యులు సమకూర్చిన రూ.7,200ను ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్‌లకు మంగళవారం అందించారు. విజయనగరంలో ఉత్తరాంధ్ర జిల్లాల సమావేశం జరిగిన సందర్భంగా ఈ విరాళాన్ని అందించినట్టు ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు కిమిడి రామ్మూర్తినాయుడు తెలిపారు.

## రాయగడలో విజయనగరం ఎంపీ పర్యటన


ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న లారీ యజమానుల సంఘం ప్రతినిధులు

**రాయగడ:** విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మంగళవారం రాయగడలో పర్యటించారు. వందేభారత్ రైలు ప్రారంభం సందర్భంగా ఆ రైలులో విజయనగరం నుంచి రాయగడకు వచ్చారు. స్థానిక సర్క్యూట్ హౌస్‌లో బసచేసిన ఆయనను మంగళవారం ఉదయం పట్టణంలోని పలువురు ప్రముఖులు, కుల సంఘాల ప్రతినిధులు, తెలుగు సంస్థల ప్రతినిధులు కలిశారు. పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. కూనేరు-పార్వతీపురం రహదారిని మరమ్మతులు చేయాలని కోరుతూ పలువురు వినతిపత్రం అందజేశారు. అలాగే బెంగుళూరు, హైదరాబాద్ తదితర నగరాల నుంచి రాయగడకు రైలు సౌకర్యం కల్పించాలని కోరారు. వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లగా, సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎంపీ తెలిపారు.

ఒడిశా

## శ్రామికులతోనే ఆర్థికాభివృద్ధి

**రాయగడ:** శ్రామికులతోనే దేశ ఆర్థికాభివృద్ధి ముడిపడి ఉందని భారతీయ మజ్దూర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాదల్ మహారాణా అన్నారు. మంగళవారం బీఎంఎస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా స్థానిక బిజూ పట్నాయక్ ఆడిటోరియంలో బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు జోగేశ్వరదాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. శ్రామికులంతా ఐక్యతతో హక్కులు సాధించుకోవాలన్నారు. అనంతరం సమాజ సేవకుడు 'స్పందన' అధ్యక్షుడు గుడ్ల గౌరీశంకర్‌ప్రసాద్‌ను, వివిధ సంఘాల ప్రతినిధులను సత్కరించారు. సీనియర్ పాత్రికేయులు బాదల్‌ధా, ఇంఫా తెరువలి పరిశ్రమ పీఆర్వో శక్తిప్రసాద్ పాణిగ్రహి తదితరులు పాల్గొన్నారు.

## డ్రాపౌట్లను గుర్తించాలి: కలెక్టర్

**పార్వతీపురం, ఆంధ్రజ్యోతి:** డ్రాపౌట్ విద్యార్థులను గుర్తించి బడిలో చేర్పించాలని కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టర్ సమావేశ మందిరంలో విద్యాశాఖపై ఆయన సమావేశం నిర్వహించారు. న్యూట్రిషన్ గార్డెన్స్, మధ్యాహ్న భోజన పథకం, విద్యార్థుల హాజరు, డ్రాపౌట్స్, హైస్కూల్ మధ్యాహ్న భోజన పథకం, విద్యార్థుల హాజరు, డ్రాపౌట్స్, హైస్కూల్, హై ప్రైడ్, పీఎంశ్రీ స్కూల్స్ తదితర అంశాలపై మండలాల వారీగా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ డ్రాపౌట్స్ విద్యార్థులు నూరు శాతం ఏదో ఒక విద్యా సంస్థలో చదువుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంఈవోలను ఆదేశించారు. పాఠశాలల్లో ప్రతినెలా విద్యార్థులకు ఎనీమియా పరీక్షలు నిర్వహించే విధంగా క్లాస్‌టీచర్ పర్యవేక్షణ చేయాలన్నారు. పాఠశాల్లో ప్రవేశాలు పెంచేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో డీఈవో జి.పగడాలమ్మ, డిప్యూటీ డీఈవోలు రాజ్‌కుమార్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## ఆర్డీవో హేమలత సేవలు చిరస్మరణీయం


ఆర్డీవోకు జ్ఞాపికను అందిస్తున్న కలెక్టర్, జేసీ, సబ్ కలెక్టర్

**పార్వతీపురం, ఆంధ్రజ్యోతి:** ఆర్డీవోగా పనిచేసిన హేమలత సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ శ్యాంప్రసాద్ అన్నారు. బదిలీపై వెళుతున్న ఆమెకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ అందరి సహాయ సహకారాలతో బాధ్యతలను నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ శోభిక, పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, డీఆర్వో జి.కేశవనాయుడు, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారి ఓ.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

## శివన్నపేటలో రక్తదాన, వైద్య శిబిరం


విగ్రహాల ఆవిష్కరణలో ఎమ్మెల్యేలు

**కురుపాం:** టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్ చంద్రదేవ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక శివన్నపేటలో రక్తదాన, వైద్య శిబిరం నిర్వహించారు. మాజీ ఎంపీ వైరిచర్ల ప్రదీప్ చంద్రదేవ్ వైద్య శిబిరం ప్రారంభించగా, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి రక్తదాన శిబిరం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు, పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర పాల్గొన్నా రు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని రక్తదానం చేశారు.

**ఎన్టీఆర్, అంబేడ్కర్ విగ్రహాల ఆవిష్కరణ**

కురుపాంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్, అంబేడ్కర్ విగ్రహాలను వీరేశ్ చంద్రదేవ్, కురుపాం, బొబ్బిలి, పార్వతీపురం ఎమ్మెల్యేలతో పాటు మాజీ ఎంపీ వైరిచర్ల ప్రదీప్ చంద్రదేవ్ ఆవిష్కరించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సామూహిక గృహ ప్రవేశాలు

**జియ్యమ్మవలస:** మండలంలో ని గెడ్డతిరువాడ పంచాయతీ కేం ద్రంలో సర్పంచ్ గుంట్రెడ్డి తవిటమ్మ ఆధ్వర్యంలో మంగళవారం సామూ హిక గృహ ప్రవేశాలు నిర్వహించా రు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మా ణశాఖ ఇన్‌చార్జి పీడీ కేశవనాయు డు పాల్గొని, మాట్లాడారు. పీఎంఏవై పథకం ద్వారా పంచాయతీలో 40 ఇళ్లు మంజూరు కాగా, అందులో 11 ఇళ్లు పూర్తయ్యాయని చెప్పారు. వీటిలో లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయించామన్నారు. అనంతరం వారికి హక్కు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణశాఖ డీఈఈ ఎస్.వెంకటరావు, ఏఈఈ ఆర్.ఉమామహేశ్వరరావు, డీటీ డప్పు పకీరు, పంచాయతీ టీడీపీ లీడర్ ఎం.అనిల్, తదితరులు పాల్గొన్నారు.

## కౌలురైతులను ఆదుకోండి

**గుమ్మలక్ష్మీపురం:** స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మంగళవారం సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో రైతు సమస్యలపై ధర్నా నిర్వహించారు. కౌలు రైతులకు ప్రభుత్వం ఆదుకోవాలని, రైతు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, షెడ్యూల్ గిరిజన ప్రాంతంలో 1/70 చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

## నిరుద్యోగ నిర్మూలనకు కృషి

- ఎమ్మెల్యే జయకృష్ణ

**పాలకొండ:** నిరుద్యోగ నిర్మూలనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నియోజకవర్గానికి సంబంధించి పట్టణంలోని శ్రీసత్యసాయి డిగ్రీ కళాశాల ఆవరణలో మంగళవారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రతినెలా జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఏ.శ్రీనివాస్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ పాల్గొన్నారు. జాబ్‌మేళాలో 17 కంపెనీ ప్రతినిధులు హాజరయ్యారు. సుమారు 695 మంది ఇంటర్వ్యూలకు హాజరుకాగా అందులో 274మంది ఎంపికయ్యారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.అప్పలనాయుడు, ఎం.తేజోవతి, పార్టీ పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్, మండల అధ్యక్షుడు గండి రామినాయుడు, శ్రీసత్యసాయి విద్యా సంస్థల వ్యవస్థాపకుడు బి.లక్ష్మీనారాయణ, కరస్పాండెంట్ డి.వెంకటరమణ పాల్గొన్నారు.

## క్రీడాకారుల ఎంపిక

**సీతంపేట రూరల్:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొత్తంగా 500 మంది గిరిజన విద్యార్థులు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని డిప్యూటీ డీఈవో నారాయుడు చెప్పారు. ఏటీడబ్ల్యూవో మంగవేణి, ఏఎంవో కోటిబాబు, జీసీడీవో రాములమ్మ, హెచ్ఎం టి.చంద్రరావు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అప్రంటిస్ శిక్షణకు అవకాశం కల్పించండి

**సీతంపేట రూరల్:** సీతంపేట కేజీబీవీ జూనియర్ కళాశాలలో మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ కోర్సు పూర్తి చేసిన తమకు సీతంపేట ఏరియా ఆసుపత్రిలో అప్రంటిస్ శిక్షణకు అవకాశం కల్పించాలని గిరిజన విద్యార్థినులు కోరారు. ఈ మేరకు మంగళవారం సీతంపేట ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డిని కలిసేందుకు వారు ఐటీడీఏ కార్యాలయానికి వచ్చారు. వారు కార్యాలయంలో బయట విలేకర్లతో మాట్లాడారు. పీవో స్పందించి తమకు సీతంపేట ఏరియా ఆసుపత్రిలో అప్రంటిస్ శిక్షణ, సర్టిఫికెట్ ఇప్పించాలని కోరారు.

## వీడీవీ కేంద్రాల పరిశీలన

**సీతంపేట రూరల్:** సీతంపేట ఐటీడీఏ పరిధిలో నిర్వహిస్తున్న వన్‌ధన్ వికాస్ కేంద్రాలను ఒడిశా రాష్ట్ర భువనేశ్వర్‌కు చెందిన ట్రైబల్ డెవలప్‌మెంట్ కోపరేటివ్ కార్పొరేషన్‌కు చెందిన మేనేజర్ దెబతోష్, కన్సల్టెంట్ శ్రీలగ్న మహాపాత్రోలు మంగళవారం పరిశీలించారు. ఐటీడీఏకు సమీపంలో ఉన్న ముక్కుడిపోలమ్మ వీడీవీకే జీడి ప్రోసెసింగ్ యూనిట్, చంద్రమ్మ వీడీవీకే కొండచీపుర్లు తయారీ కేంద్రం, అగర్‌బత్తి యూనిట్‌ను పరిశీలించారు. ఇక్కడ మహిళలు ఏవిధంగా వీడీవీకే కేంద్రాలను నిర్వహిస్తున్నారో సంబంధిత మహిళా సంఘాల సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో వారి వెంట జీసీసీ బీఎం కృష్ణారావు, ఐకేపీ ఇన్‌చార్జి ఏపీడీ సన్యాసిరావు, ఏపీఎంలు ఉన్నారు.

## గణపతి లడ్డూ రూ.1.32లక్షలు


లడ్డూతో చంటి, తదితరులు

**జియ్యమ్మవలస:** మండలంలోని తూర్పు ఏజెన్సీ ప్రాంతంలో గణపతి ఉత్సవాల్లో భాగంగా లడ్డూ వేలం పాట నిర్వహించగా, రూ.లక్షా 32వేల 750లకు పలికింది. టీకే జమ్ము పంచాయతీ కేంద్రంలో శ్రీవరసిద్ధి వినాయక మహోత్సవంలో అదే గ్రామానికి చెందిన ఆరిక చంటి, కూరంగి మన్మథరావు, అడ్డాకుల శంకర్‌లు ఈ లడ్డూను కైవసం చేసుకున్నారు. గిరిజన గ్రామాల్లో ఇంత ధర వేలంలో పలకడం ఇదే మొదటిసారి.

## ఆరోగ్య కేంద్రాల్లో నిలిచిన ఓపీ సేవలు

**గరుగుబిల్లి:** పీజీ వైద్య విద్య ప్రవేశాల్లో ఇన్ సర్వీసు కోటాను కుదించడాన్ని వ్యతిరేకిస్తూ వైద్యులు చేపట్టిన ఆందోళన కార్యక్రమం తీవ్ర రూపం దాల్చింది. ఈనేపథ్యంలో వైద్యులు విధులకు దూరం కావడంతో ఓపీ సేవలు నిలిచిపోయాయి. దీంతో పలు గ్రామాల నుంచి పీహెచ్‌సీలకు వైద్య సహాయం నిమిత్తం వచ్చే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో దిగువ స్థాయి వైద్య సిబ్బంది తాత్కాలిక వైద్యాన్ని అందజేసి పంపిస్తున్నారు.

## క్లుప్తంగా..

**పీజీ ప్రవేశాలకు 19 వరకు అవకాశం**

**సాలూరు:** సాలూరులో ఉన్న ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఎంఎస్సీ కెమిస్ట్రీ, ఆర్గానిక్, కంప్యూటర్ సైన్స్ కోర్సులకు ఈనెల 17 నుంచి 19 వరకు రిజిస్ట్రేషన్లు చేసుకో వచ్చునని ప్రిన్సిపాల్ డా.కె.ఉషశ్రీ మంగళవారం తెలిపారు. ఈనెల 23 నుంచి 25 వరకు వెబ్ ఆప్షన్ ఉంటుందని అన్నారు. ప్రభుత్వం నుంచి ఫీజ్ రియంబర్స్‌మెంట్ కూడా ఉంటుందని తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**ఆర్ఎంపీ కుటుంబానికి ఆర్థిక సాయం**

**సాలూరు రూరల్:** సాలూరులో ప్రజా వైద్యుడిగా పేరుపొందిన ఆర్ఎంపీ టికే పోలాచారి ఈనెల 7 గుండెపోటుతో మృతిచెందారు. ఆయన కుటుంబానికి మీకై మేము సంస్థ మంగళవారం ఆర్థిక సాయం అందించింది. సంస్థ వ్యవస్థాపకుడు ఇప్పిలి దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో సభ్యులు రూ.10వేలు సాయం చేశారు.

**మరిపిల్లి ఘటనపై నివేదిక కోరాం**

**సాలూరు రూరల్:** మరిపిల్లిలో వినాయక నిమజ్జనం సందర్భంగా జరిగిన కొట్లాట ఘటనపై కలెక్టర్, ఎస్పీలను నివేదికను కోరామని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు మంగళవారం స్థానిక విలేకర్లకు తెలిపారు. గిరిజన మహిళా ఎంపీటీసీ జన్ని సీతారాంపై దాడి జరిగినట్టు తెలిసిందని, ఈ ఘటనపై నిజానిజాలు తెలుసుకోవడానికి సుమోటోగా తీసుకున్నామని తెలిపారు.

**ఉత్సవాలపై ఎటువంటి అభ్యంతరం లేదు**

**సాలూరు రూరల్:** సాలూరులో వినాయక చవితి ఉత్సవాలను ప్రభుత్వ అభిమతం మేరకు నిర్వహించుకోవచ్చునని, తనకే అభ్యంతరం లేదని మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర తెలిపారు. ఆయన మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. తన హయాంలో 21 రోజుల వరకు ఉత్సవాల నిర్వహణకు అనుమతించామని చెప్పారు. ప్రస్తుత మంత్రి ఎన్ని రోజులు నిర్వహించాలంటే అలాగే నిర్వహించుకోవచ్చన్నారు. శ్యామలాంబ పండుగను వివిధ కారణాల వల్ల తమ హయాంలో నిర్వహించలేక పోయామని తెలిపారు.

**సత్యసాయి అన్నదానానికి లక్ష విరాళం**

**పాలకొండ:** పాలకొండ సత్యసాయి సేవా సమితి ద్వారా నిర్వహిస్తున్న నిత్యాన్నదాన కార్యక్రమానికి స్థానిక ఆంజనేయనగర్ కాలనీకి చెందిన పొట్నూరు వెంకటరమణ మాస్టారు రూ.లక్ష విరాళం అందించారు. తన జన్మదినోత్సవం సందర్భంగా కుటుంబీకుల సమక్షంలో మంగళవారం స్థానిక సత్యసాయి మందిరంలో సంస్థల ప్రతినిధులకు ఈ విరాళాన్ని అందించారు.

**తెరుచుకోని ఆధార్ కేంద్రం**

**జియ్యమ్మవలస:** మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంపై ఉన్న ఆధార్ సెంటర్ మంగళవారం తెరవకపోవడంతో పలువురు ఇబ్బందులు పడ్డారు. ఆధార్ నమోదుకు, మార్పులు, చేర్పులు కోసం వచ్చిన పలువురు వెనుదిరగాల్సి వచ్చింది.

**రహదారి పనుల పరిశీలన**

**మక్కువ:** మండలంలోని దబ్బగెడ్డ గ్రామం నుంచి నగుళ్లదబ్బగెడ్డ వరకు రోడ్డు నిర్మాణానికి రూ.కోటి 60లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు నిర్మాణ పనుల నిమిత్తం జిల్లా పంచాయతీరాజ్ ఈవో బి.రవి మంగళ వారం ఆ రహదారిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రహదారి పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్‌శాఖ డీఈ చిన్నమనాయుడు, మండల జేఈ రజిత్, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## నులి పురుగుల నివారణకు కృషి చేద్దాం


కొమరాడ: విద్యార్థినితో మాత్రలు మింగిస్తున్న జగన్మోహన్‌రావు

**గరుగుబిల్లి/ సీతానగరం/ వీరఘట్టం:** నులి పురుగుల నిర్మూలన దినోత్సవం (డీవార్మింగ్ డే) జిల్లా వ్యాప్తంగా మంగళవారం నిర్వహించారు. మండల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించారు. పిల్లల్లో నులి పురుగుల నివారణకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, సీహెచ్‌వోలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు. ● **కొమరాడ:** విక్రంపురం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన డీ వార్మింగ్ కార్యక్రమాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో టి.జగన్మోహన్‌రావు, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి రఘుకుమార్ మంగళవారం పరిశీలించారు. విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. హెచ్ఎం పీహెచ్ఎస్ విజయకుమారి, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా విశ్వకర్మ జయంతి

**పార్వతీపురంటౌన్:** విశ్వకర్మ జయంతి వేడుకలు జిల్లాలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పార్వతీదేవి ఆలయంలో పట్టణ విశ్వబ్రహ్మణ, స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ పూజలు చేశారు. అనంతరం తిరువీధోత్సవం నిర్వహించారు. నెయ్యిల వీధిలోగల ఉత్సవ మండపంలో విశ్వకర్మ పూజలనంతరం సాయంత్రం నిమజ్జనం చేశారు.

● **బెలగాం:** పట్టణ శ్రీపార్వతీదేవి కార్పెంటరీ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పూజల్లో ఎమ్మెల్యే విజయచంద్ర పాల్గొన్నారు. విశ్వబ్రహ్మణ సంఘ అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ● **గరుగుబిల్లి:** గొట్టివలసలో శ్రీగోవిందమాంబ సమేత శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శ్రీవిశ్వకర్మ మహాయజ్ఞం కార్యక్రమాన్ని నిర్వహించారు. ● **భామిని:** బత్తిలిలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ విగ్రహాన్ని ఊరేగించారు. పెద్దవీధిలో మండపం ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు.


బెలగాం: విశ్వకర్మ పూజలో పార్వతీదేవీ కార్పెంటరీ సంఘం సభ్యులు


పార్వతీపురంటౌన్: తిరువీధి నిర్వహిస్తున్న దృశ్యం


గరుగుబిల్లి: విశ్వకర్మకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం


భామిని: విశ్మకర్మ ప్రతిమను ఊరేగిస్తున్న దృశ్యం